ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 28 జనవరి 2025



స్పెషల్ బ్రాంచిలో ఇష్టారాజ్యం

పోర్టు ఇమ్మిగ్రేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌కు అడ్డగోలుగా పోస్టింగ్



- వసూళ్ల కోసం అస్మదీయుడికి పోస్టింగ్ ఇచ్చిన అధికారి
- సీపీ దృష్టికి చేరడంతో సీరియస్
- వెంటనే పోస్టింగ్ ఉత్తర్వును రద్దు చేసిన అధికారి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనరేట్‌లో అత్యంత కీలకమైన స్పెషల్‌బ్రాంచి విభాగం గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విభాగంలో పని చేస్తున్న కొందరు అధికారులు సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని ఆ శాఖలోనే ప్రచారం జరుగుతోంది. తాజాగా సీపీ దృష్టిలో పెట్టకుండానే పోర్టు ఇమ్మిగ్రేషన్‌లో ఒక హెడ్ కానిస్టేబుల్‌కు పోస్టింగ్ ఇవ్వడం చర్చనీయాంశమైంది.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి వరకూ బదిలీలన్నీ నగర పోలీస్ కమిషనర్ విచక్షణ మేరకు జరుగుతాయి. ఎవరినీ బదిలీ చేయాలన్నా, పోస్టింగ్ ఇవ్వాలన్నా సరే సీపీ ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంటుంది. ఒకవేళ పని ఒత్తిడి ఉండి కానిస్టేబుళ్ల బదిలీలను జాయింట్ సీపీ, డీసీపీ స్థాయి అధికారులకు సీపీ అప్పగించినా, ఉత్తర్వులు జారీచేయడానికి ముందు తుది ప్రతిపాదనలను ఆయన పరిశీలనకు పంపించాలి. ఆ తర్వాతే ఉత్తర్వులు జారీచేయాలి. కానీ స్పెషల్‌బ్రాంచిలోని కొందరు అధికారులు సీపీ మంచితనాన్ని అలుసుగా తీసుకుంటున్నారని ఆ శాఖలోని కొందరు అధికారులు చెబుతున్నారు. పోర్టు ఇమ్మిగ్రేషన్‌లో స్పెషల్‌బ్రాంచి ఆధ్వర్యంలో ఒక ఎస్ఐతోపాటు ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఉండేవారు. విదేశాల నుంచి పోర్టుకు వచ్చే షిప్పుల్లో సిబ్బంది, అధికారులు ఎవరైనా నగరంలో అడుగుపెట్టాలంటే తాత్కాలిక వీసాను పోలీసుల నుంచి పొందాల్సి ఉంటుంది. షిప్ వచ్చినప్పుడు సంబంధిత ఏజెన్సీలు అందులోని సిబ్బందికి తాత్కాలిక వీసాలు పోర్టు ఇమ్మిగ్రేషన్ ద్వారా స్పెషల్‌బ్రాంచి ఉన్నతాధికారుల నుంచి పొందాల్సి ఉంటుంది. దీనికోసం ఆయా ఏజెన్సీలు కొంత మామూళ్లను ఇస్తుంటాయి. అలాగే షిప్పుల్లో వచ్చే విదేశీయుల నుంచి ఖరీదైన విదేశీ మద్యం, సిగరెట్లు కూడా డిమాండ్ చేసి తీసుకుంటారనే ప్రచారం ఉంది. కాగా పోర్ట్ ఇమ్మిగ్రేషన్‌లో ఉండే ఎస్ఐను సీపీ కొన్నాళ్ల కిందట బదిలీ చేయడంతో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు మాత్రమే మిగిలారు. వారిలో ఒకరికి అక్కడ ఐదేళ్లు సర్వీస్ పూర్తవడంతో అక్కడి నుంచి ఇటీవల బదిలీ చేశారు. అక్కడ ఖాళీ అయిన హెడ్ కానిస్టేబుల్ స్థానంలో తనకు అస్మదీయుడైన హెడ్ కానిస్టేబుల్‌కు పోస్టింగ్ ఇప్పించుకుంటే భారీగా ఆదాయం వస్తుందని స్పెషల్‌బ్రాంచిలోని ఒక అధికారి భావించారు. అనుకున్నదే తడవుగా తన పైఅధికారి ద్వారా ఆ హెడ్ కానిస్టేబుల్‌కు పోర్టు ఇమ్మిగ్రేషన్‌లో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వు జారీచేశారు. అడ్డగోలుగా పోస్టింగ్ ఇచ్చిన విషయం సీపీ దృష్టికి చేరింది. దీంతో సదరు అధికారిని తన ఛాంబర్‌కు పిలిచి సీపీ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు పోలీస్‌శాఖలో ప్రచారం జరుగుతోంది. సీపీ ఆదేశంతో తాను ఇచ్చిన హెడ్ కానిస్టేబుల్ పోస్టింగ్ ఆర్డరును సదరు అధికారి రద్దు చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం పోర్టు ఇమ్మిగ్రేషన్‌లో ఎస్ఐ లేకపోవడంతో ఏజెన్సీలు నేరుగా స్పెషల్‌బ్రాంచిలోని ఒక అధికారిని కలిసి తమ షిప్పులో వచ్చే సిబ్బందికి తాత్కాలిక వీసాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో డబ్బులు గుంజుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమార్కుల విషయంలో సీపీ శంఖబ్రతబాగ్చి కఠినంగా వ్యవహరిస్తారని తెలిసినప్పటికీ స్పెషల్‌బ్రాంచిలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

- ప్రజల వద్దకే ప్రజా ప్రతినిధులు, అధికారులు
- తమ సమస్యలను నేరుగా వారి దృష్టికి తీసుకువెళ్లే అవకాశం
- నేడు తిరుమల నగర్‌లో కార్యక్రమం

సమయం: ఉదయం 10 గంటలు
వేదిక : తిరుమలనగర్‌లోని ఆర్యవైశ్యకల్యాణమండపం

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):
ఇప్పటివరకూ ప్రజల గొంతుకగా వారి సమస్యలను ఎప్పటికప్పుడు ఎలుగెత్తి చూపుతున్న 'ఆంధ్రజ్యోతి'...ఇకపై ఆ సమస్యల పరిష్కారానికి ఆచరణీయ పద్ధతిలో ముందుకు కదులుతోంది. ఇందుకోసం 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం నిర్వహించేందుకు నడుంబిగించింది. దీని ద్వారా అధికారులు-ప్రజాప్రతినిధులకు, ప్రజలకు నడుమ వారధిగా మారనుంది. జిల్లాలో మొదటి కార్యక్రమం మంగళవారం ఉదయం పది గంటలకు గాజువాక నియోజకవర్గ పరిధిలోని 87వ వార్డులో గల తిరుమల నగర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరగనున్నది. తిరుమల నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు హాజరై తమ సమస్యలను నేరుగా ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లవచ్చు. ఈ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, జోన్-5 కమిషనర్ శేషాద్రి, సౌత్ సబ్‌డివిజన్ ఏసీపీ టి.త్రినాథరావు, ఐలా కమిషనర్ ఎ.కిషోర్, ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, ఈపీడీసీఎల్ ఏడీ రామకృష్ణ, పలు శాఖలకు చెందిన అధికారులు హాజరుకానున్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై ఆయా శాఖల అధికారులతోపాటు ప్రజా ప్రతినిధులు స్పందిస్తారు.

టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు



చేసిన మంచిని ప్రజలకు చెప్పండి

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని నేతలకు మంత్రి నారా లోకేశ్ పిలుపు

- ఏడు నెలల్లో రైల్వే జోన్, విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యల పరిష్కారం
- అనేక ఐటీ కంపెనీలను, పరిశ్రమలను తీసుకువస్తున్నాం
- క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలను బలోపేతం చేయడంపై నేతలు దృష్టిసారించాలి
- కార్యకర్తలకు అన్నివిధాలా అండగా నిలవండి
- ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులతో సమీక్ష

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):
ఉత్తరాంధ్ర అభివృద్ధికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులకు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

సోమవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్రకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ బలోపేతం కోసం తీసుకోవలసిన చర్యలు, సంస్థాగత అంశాలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలను బలోపేతం చేయడంపై నేతలు దృష్టిసారించాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అన్నివిధాలా అండగా నిలవాలన్నారు. పార్టీయే సుప్రీం అని, దానివల్లే ఈ స్థాయిలో ఉన్నామనే విషయాన్ని నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. పార్టీ వల్లనే తాను యువగళం పాదయాత్ర చేయగలిగానన్నారు. రాష్ట్రానికి ప్రధాని నరేంద్రమోదీ సహకరిస్తున్నారని, ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి ... మిగతా 6వ పేజీలో



పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

లోకేష్ ప్రజా దర్బార్

- పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరణ
- ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామని హామీ - 6లో

ఆ రెండు పోస్టులకు పోటీ

- వచ్చే నెలాఖరుతో ముగియనున్న ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్ బుచ్చిరాజు పదవీకాలం
- కేజీహెచ్‌కు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ శివానంద
- పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా సీనియర్‌ను నియమించే అవకాశం



విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) :
ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టుల కోసం పలువురు సీనియర్ వైద్యులు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బుచ్చిరాజు వ్యవహరిస్తున్నారు. ఆయన పదవీ కాలం ఫిబ్రవరి నెలాఖరుతో ముగియనుంది. దీంతో ఇప్పటి నుంచే పలువురు తమకు తెలిసిన రాజకీయ నాయకుల ద్వారా ప్రిన్సిపాల్ పోస్టు కోసం ప్రయత్నాలను సాగిస్తున్నారు. అలాగే, కేజీహెచ్‌కు డాక్టర్ శివానంద ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఉన్నారు. సీనియారిటీ ప్రకారం పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా నియమించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. వచ్చే నెల మొదటి వారంలో ఈ ప్రక్రియ నిర్వహించే అవకాశం ఉందని చెబుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం సీనియారిటీతో సంబంధం లేకుండా వైద్యులను కీలక స్థానాల్లో కూర్చోబెట్టింది. దీనివల్ల ఎంతోమందికి అన్యాయం జరిగిందని పలువురు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో సీనియర్ వైద్యులకు అవకాశం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. దీంతో పలువురు సీనియర్‌లు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ... మిగతా 6వ పేజీలో

పర్యాటక హబ్‌గా విశాఖ

- నగరాన్ని క్రూయిజ్ హబ్‌గా మారుస్తాం
- పర్యాటక రంగాన్ని పీ-4 విధానంలో అభివృద్ధి చేయాలన్నది ముఖ్యమంత్రి ఆకాంక్ష
- ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్
- వాటర్, అడ్వంచర్ స్పోర్ట్స్‌కు సహకారం: స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్
- కోస్తాలో కొత్తగా 30 బీచ్‌లు అభివృద్ధి: ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి
- విశాఖ, కాకినాడ నగరాలను లీజర్ .హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడి



ప్రాంతీయ సదస్సు వేదికపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్‌లను సత్కరిస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి విశాఖపట్నమే రియల్ హబ్ (నిజమైన కేంద్రం)గా నిలుస్తుందని, ఆ విధంగా అభివృద్ధి చేస్తామని ఆ శాఖా మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. నోవాటెల్‌లో సోమవారం నిర్వహించిన ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లు ... మిగతా 6వ పేజీలో

పర్యాటక అభివృద్ధికి విశాఖ అనుకూలం



కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ విశాఖపట్నం పర్యాటక అభివృద్ధికి అత్యంత అనుకూలమైన ప్రాంతమని హరేంధిర ప్రసాద్ చెప్పారు. పరిశుభ్రమైన, అందమైన నగరంగా విశాఖకు పేరుందన్నారు. తొట్లకొండ, బావికొండ బుద్ధిస్ట్ పర్యాటకానికి ఉపయోగపడతాయన్నారు. త్వరలో సీ ప్లేన్ టూరిజం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. కార్వాన్ టూరిజం కూడా ప్రారంభమవుతుందన్నారు.

గీత కార్మికులకు 14 మద్యం దుకాణాలు

- గెజిట్ జారీ
- వచ్చే నెల ఐదో తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో గీత కార్మికులకు 14 మద్యం దుకాణాలు కేటాయిస్తూ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ సోమవారం గెజిట్ జారీచేశారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి 11, యాతకు ఒకటి, గౌడలకు రెండు దుకాణాలను కేటాయించారు. 2026 సెప్టెంబరు వరకూ నిర్వహించుకునేందుకు అవకాశం ఉండే ఈ దుకాణాలకు అర్హులైన వారంతా వచ్చే నెల ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రసాద్ తెలిపారు. దరఖాస్తు ఫీజు కింద (నాన్ రిఫండబుల్) రూ. రెండు లక్షలు డీడీ తీయాల్సి ఉంటుందని, దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగానీ, జిల్లాలోని ఆరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లలో స్వయంగానీ అందజేయవచ్చునన్నారు. దుకాణాలకు లైసెన్స్ ఫీజు కింద జీవీఎంసీ పరిధిలో అయితే ఏడాదికి రూ.42.5 లక్షలు, ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ పరిధిలో అయితే రూ.32.5 లక్షలు చెల్లించాల్సిఉంటుందన్నారు. దుకాణాలకు లాటరీని వచ్చే నెల ఏడున జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

ప్రారంభానికి నోచుకోని రూ.75 కోట్ల పనులు రద్దు

- జీవీఎంసీ నిర్ణయం
- టెండర్లు ఖరారై మూడేళ్లు దాటినా ప్రారంభం కాని వైనం
- కొత్తగా అంచనాలు తయారుచేసి మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయం



విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ పరిధిలో రూ.75 కోట్ల విలువైన పనులకు సంబంధించిన టెండర్లను అధికారులు రద్దు చేశారు. గత మూడేళ్లలో టెండర్లు పిలిచిన పనుల్లో ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోని వాటిని రద్దు చేయాలని నిర్ణయించారు. ఆయా పనుల్లో అవసరమైన వాటిని గుర్తించి, తిరిగి టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలో ఏటా సుమారు రూ.500 కోట్ల విలువైన పనులు జరుగుతుంటాయి. వీటికి అధికారులు టెండర్లు పిలుస్తారు. తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకుని, వర్క్ ఆర్డర్ అందజేస్తారు. కాంట్రాక్టర్ ఆయా పనులను పూర్తిచేసిన తర్వాత అధికారులకు సమాచారం ఇస్తే ఎంబుక్ రికార్డు చేసి బిల్లు చెల్లింపునకు చర్యలు తీసుకుంటారు. అయితే జీవీఎంసీ ... మిగతా 6వ పేజీలో

అప్పన్న భూములకు లభించని నష్టపరిహారం

- ప్రభుత్వ సంస్థలకు కేటాయించినా ప్రతిఫలం శూన్యం
- దేవస్థానానికి దక్కని మేలు
- రూ. కోట్లలో బకాయిలు



దేవస్థానం భూముల్లో నిర్మించిన గురుకుల విద్యాలయం

సింహాచలం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న భూములను ఆక్రమించుకుని కొంత మంది భవనాలు నిర్మించినా సింహాచలం దేవస్థానానికి ఎలాంటి పరిహారం దక్కడం లేదు. కనీసం ప్రత్యామ్నాయ భూముల విషయంపై ప్రభుత్వాలు నోరుమెదపటం లేదు. దీంతో సుమారు ఐదు దశాబ్దాలుగా దేవస్థానానికి చెందిన పలు స్థలాలు పరాధీనమయ్యాయి. దేవస్థానం రికార్డుల ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్ఎస్‌టీఎల్ సంస్థకు 1972లో అడివివరం గ్రామానికి చెందిన 275 సర్వే నంబరులో 37.75 ఎకరాలను కేటాయించగా దానికి సంబంధించిన పరిహారం సమస్య న్యాయస్థానం పరిధిలో ఉంది. అడివివరం గ్రామానికి చెందిన 275 సర్వే నంబరులోని 32.41 ఎకరాల భూమిని సింహగిరిపై మైక్రోవేవ్ స్టేషన్ నిర్మాణానికి తీసుకోగా,ఈఅంశం కూడా కోర్టులోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్యశాఖ వాటర్‌వర్క్సు కార్యాలయం, వాటర్‌ట్యాంక్ నిర్మాణాలకు అడివివరం సర్వే నంబరు 275లో 1978లో 3.15ఎకరాల భూమిని దేవస్థానం నుంచి ప్రతిగా ఇప్పటివరకు పైసా చెల్లించలేదు.

నగరంలోని సీతమ్మధార సమీపంలో అడివివరం సర్వే నంబరు 275లో 3.31 ఎకరాలను సాంఘిక సంక్షేమకు పేదల ఇళ్లకాలనీకోసం 1978లో కేటాయించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేపగుంట సమీపంలో ఎస్సీ కాలనీ నిర్మాణానికి అడివివరం గ్రామ సర్వేనంబరు 275లో 1.6ఎకరాలను 1982లో కేటాయించారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సమాచార భారతి విభాగం పరిధిలో సింహగిరిపై టీవీ టవర్, టీవీ స్టేషన్ ఏర్పాటుకు 1984లో 2.91 ఎకరాలు కేటాయించింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సింహాచలానికి చేరువలో నిర్మించిన మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలకు 1984లో దేవస్థానికి చెందిన సర్వే నంబరు 275లో 45.32 ఎకరా లను తీసుకున్నారు. ఎన్‌హెచ్-5 విస్తరణలో భాగంగా వెంకోజీపాలెం - హనుమంతువాక మధ్యలో అడివివరం సర్వే నంబరు 275లోని సింహాచల దేవస్థానానికి చెందిన 1.15 ఎకరాల భూమిని ఎన్‌హెచ్(ఏడిబి) డివిజన్ ఉపయోగించుకుంది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రహ్లాదపురంలో పేదల ఇళ్ల కాలనీ ఏర్పాటుకు వేపగుంట సర్వే నంబరు 133లో ఆరు ఎకరాలు దేవస్థానం భూమిని వినియోగించుకున్నారు. వేపగుంట గ్రామానికి చెందిన కొన్ని సర్వే నంబర్లలో 1982లో సింహాచల దేవస్థానానికి చెందిన 144.75ఎకరాలు భూమిని జీఓఎంఎస్ నం 237తో ఉడాకు కేటాయించగా దానికి సంబంధించిన కేసు కూడా ప్రస్తుతం కోర్టులోనే ఉంది. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అగ్నిప్రమాద బాధితులకు ఇళ్లకాలనీ నిర్మాణానికి వేపగుంట గ్రామ సర్వేనంబరు 75లో 6 ఎకరాల సింహాచల దేవస్థానం భూమిని 1986లో కేటాయించారు. 1990లో ఏపీఎస్ఆర్టీసీకి వేపగుంట సర్వే నంబరు 197, 198లోని 5.3ఎకరాల భూమిని కేటాయించినందుకు ప్రతిఫలంగా దేవస్థానానికి ఆర్టీసీ రూ. 10 లక్షలు చెల్లించింది. మొత్తమ్మీద ప్రభుత్వ అనుమతితో వివిధ కేంద్ర, రాష్ట్ర సంస్థలకు కేటాయించిన దేవస్థానం భూములకు సంబంధించి మూడు కేసులు కోర్టులో ఉండగా మిగిలిన సంస్థల నుంచి పరిహారం దక్కలేదు. ప్రాథమిక అంచనా ప్రకారం ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన దేవస్థానం భూముల విలువ సుమారు రూ.100కోట్లకు పైనే ఉంటుందని సమాచారం. ప్రభుత్వాలు మారినా దేవస్థానం భూముల విషయాన్ని పట్టించుకోకపోవడాన్ని భక్తులు తీవ్రంగా నిరసిస్తున్నారు.

సింహగిరిపై పని చేయని సీసీ కెమెరాలు

సింహాచలం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ రక్షణకు, భక్తుల శాంతి భద్రల పరిరక్షణకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కొన్ని పని చేయడం లేదు. సింహగిరిపై, కొండదిగువన భక్తులు అధికంగా తిరిగే ప్రదేశాలు, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పలు దపాలుగా 250 సిసి కెమెరాలను లక్షలాది రూపాయలతో దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను ఏడాది కాలానికి ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఆ కాంట్రాక్టు నెల రోజుల క్రితంతో ముగిసింది. దీంతో కెమెరాల నిర్వహణ కరువైంది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సుమారు 50 వరకు కెమెరాలు మొరాయించాయి. పని చేయని కెమెరాలతో అప్పన్న ఆలయ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఏదైనా సంఘటన జరగకముందే కెమెరాల మరమ్మతుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

కన్నుల పండువగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కన్నుల పండువగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కాపు సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాము

ఆనందపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా శొంఠ్యాం గ్రామానికి చెందిన బొత్స రాము నియమితులయ్యారు. సోమవారం ఆయన నగరంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె. మురళీకృష్ణనాయుడు చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా రాము ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని కాపులందరినీ ఒక తాటిపైకి తీసుకువస్తానన్నారు.సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని చెప్పారు.

139 పశువులకు చికిత్స

ఎండాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని ఆ శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ రామకృష్ణ ప్రారంభించారు. వైద్యులు 139 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నొడగల అప్పారావు, ప్రాంతీయ పశు వైద్య శాల ఉప సంచాలకుడు డాక్టర్ మోహిణీ కుమార్, సహాయ సంచాలకుడు డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

భీమునిపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న పైల అలేఖ్యకు అసోసియేషన్ ఆఫ్ భీమిలి ఫ్రెండ్స్ (ప్యాబ్) సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఈ మొత్తాన్ని ఇచ్చారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు పొందిన బాలిక ఆర్థిక సమస్యలతో ఇంటర్‌లో చేరలేదని తెలుసుకుని, ఈ సహాయాన్ని అందించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాబ్ సభ్యులు సన్నీ, సత్యనారాయణ, దేవానంద్, సాయి, అశోక్, సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం



ర్యాలీ చేస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

భీమునిపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రతపై విద్యార్థులు ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలని విశాఖ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ, విశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. ఎక్కువ మందికి రహదారి భద్రతపై అవగాహన లేకపోవడంతో అతి వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన పెంచుకుని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు రహదారి భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమస్రయ ఫౌండేషన్ ప్రెసిడెంట్ లీలాప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. సహదేవుడు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆనందపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంకి బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షురాలు పిల్లా విజయ ఆధ్వర్యంలో సోమవారం సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయక్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అగౌరవపరిచిందని, ఆయన మహిళా సాధికారత కోసం రూపొందించిన ముసాయిదా బిల్లును పార్లమెంట్‌లో పాస్ కాకుండా ఆ పార్టీ అడ్డుకుందన్నారు. ఈ కారణంగా 1951లో అంబేడ్కర్ నెహ్రూ మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారని గుర్తు చేశారు. జమ్మూ కశ్మీర్ ఆర్టికల్ 370 అమలులో కూడా అంబేడ్కర్ చేసిన హెచ్చరికలను ఆ పార్టీ పట్టించుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం 1990లో అంబేడ్కర్‌ను భారతరత్నతో సత్కరించి, పార్లమెంట్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. అంబేడ్కర్ జీవితంతో ముడిపడి ఉన్న ఐదు స్థలాలను తమ ప్రభుత్వం పంచతంత్ర అనే పేరుతో అభివృద్ధి చేసినట్టు వివరించారు. అంతకముందు పలువురు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు మీసాల రామునాయుడు, బోర శ్రీను, మాదాబత్తుల బుజ్జి, బంక సీతంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జోడుగుళ్లపాలెంలో...

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు బీజేపీ అధ్యక్షుడు ఉమ్మడి పోలరాజు ఆధ్వర్యంలో జోడుగుళ్లపాలెంలో సంవిధాన్ దివాస్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు సంవిధాన్ దివాస్ ప్రతిజ్ఞ చేశారు, ఈ కార్యక్రమంలో నాయకులు మురళీమోహన్‌రాజు, అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, ఉమ్మడి సుజాత, వెంపాడ శ్రీనివాసరెడ్డి, చిన్నారావు, నూకరాజు, వెంకట్రావు, పెంటమ్మ వెంకన్న పాల్గొన్నారు.

చురుగ్గా హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు

భీమునిపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. సోమవారం పాఠశాలలో జరుగుతున్న పనులను డెప్యూటీ డీఈవో సోమేశ్వరరావు పరిశీలించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలకు సాధన చేస్తున్నారు. మరోవైపు ఉత్సవాలను పురస్కరించుకుని సెయింట్ ఆన్స్ స్కూల్ గ్రౌండ్‌లో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వీటిని ఉత్సవ్ కమిటీ గౌరవాధ్యక్షుడు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కబడ్డీ పోటీలను ది సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. అలాగే భవనాలకు రంగులు వేస్తున్నారు.

కొనసాగుతున్న చాగంటి ప్రవచనాలు



ప్రవచనాలు బోధిస్తున్న కోటేశ్వరరావు

కొమ్మాది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గురు శిష్యుల బంధం గురించి రామాయణం ఎంతో గొప్పగా వివరిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో సంపూర్ణ రామాయణంపై జరుగుతున్న చాగంటి ప్రవచనాలు సోమవారం కూడా కొనసాగాయి.ఈ సందర్భంగా ఆయన విశ్వామిత్రుడి గొప్పతనం, యాగ రక్షణకు రామ లక్ష్మణులను విశ్వామిత్రుడి వెంట పంపించడం, తాటక సంహారం, విశ్వామిత్రుడి యాగాన్ని రామలక్ష్మణులు పరిరక్షించడం, మారీచుని తరిమికొట్టి సుబాహుని సంహరించడం వంటి ఘట్టాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. విశిష్ట మహర్షి రామలక్ష్మణులకు విద్యాభ్యాస సమయంలో వారికి కేవలం విద్య నేర్పడమే కాకుండా తాము నేర్చుకున్న విద్య స్వప్రయోజనం కోసం కాకుండా సమాజ శ్రేయస్సుకు ఎలా ఉపయోగించాలో బోధించారని చెప్పారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు చర్యలు

ఎండాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహిళల భద్రత, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ భీశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన ఎండాడలోని డాక్టర్ అంబేడ్కర్ పీపుల్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యాక్స్ కళాశాలలో మహిళా భద్రతపై జరిగిన సదస్సులో మాట్లాడారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

ఎండాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం ప్రాంతానికి చెందిన యువకుడు కనిపించడం లేదని అతని కుటుంబ సభ్యులు పీఎంపాలెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాలు ప్రకారం.. దుదాని పిల్లు సింగ్ (30) బక్కనపాలెం కే1 కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈనెల 17న రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లగా అదే రోజు రాత్రి 11.30 గంటలకు తన స్నేహితుడికి విశాఖ రైల్వేస్టేషన్‌లో కనిపించాడు. ఇప్పటివరకూ ఆచూకీ లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పర్యావరణ హిత కట్టడాలకు ప్రాధాన్యం

సాగర్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ రంగంలో అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు సహజ సిద్ధమైన నిర్మాణ సామగ్రి ఉపయోగించి, పర్యావరణ హిత కట్టడాలకు ప్రాధాన్యమివ్వాలని బెంగళూరుకు చెందిన బయోమ్ ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ ఆర్కిటెక్ట్ చిత్ర విశ్వనాథ్ పేర్కొన్నారు. గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ వీభూతి సత్యదేవ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు బహుమతులు ప్రదానం



పోటీల్లో గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు

పద్మనాభం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రేవిడిలో గణతంత్ర వేడుకలు పురస్కరించుకుని కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ, విశాఖపట్నం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ స్థాయి క్రీడా పోటీల్లోని విజేతలకు నిర్వాహకులు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎంపీడీఓ ఎంఎస్ బాపిరాజు, నాయకులు కె.రమణ, శ్రీనివాస యువజన సంఘం అధ్యక్షుడు కె. సన్యాసినాయుడు, మధు తదితరులు పాల్గొన్నారు.

'ఎలక్ట్రికల్, ప్లంబింగ్ కార్మికులను ఆదుకోవాలి'



థామస్ అల్వా ఎడిసన్‌కు నివాళి అర్పిస్తున్న అధికారులు

భీమునిపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పట్టణ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకల సన్నిబాబు కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో చిన్నబజారు జంక్షన్‌లో థామస్ అల్వా ఎడిషన్ బల్బును కనుక్కొని ప్రపంచానికి పరిచయం చేసిన రోజును పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీ ప్రేమ ప్రసన్న వాణి, తహసీల్దార్ రామారావు, ఎస్ఐ హరీశ్, సీఐటీయూ భీమిలి డివిజన్ అధ్యక్షుడు మూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు థామస్ అల్వా ఎడిషన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే అసోసియేషన్ పతాకాన్ని తహసీల్దార్ రామారావు ఆవిష్కరించారు.

నేడు ఇంటక్ ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కుటౌన్‌షిప్,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించడంలో యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం టీటీఐ జంక్షన్ వద్ద ధర్నా చేయనున్నట్టు ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు పీవీ రమణమూర్తి తెలిపారు. ధర్నాలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లోకేష్ ప్రజా దర్బార్

- పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరణ
- ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామని హామీ

మహారాణిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటామని, అండగా నిలుస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో 57వ ప్రజా దర్బార్ నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కశింకోట ప్రాంతానికి చెందిన ప్రభాకర్ తన మూడేళ్ల కుమార్తె అనారోగ్యానికి గురైందని వైద్య చికిత్సకు సాయం అందించాలని లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. వీఎంఆర్‌డీఏలో విధులు నిర్వహిస్తూ తన భర్త చనిపోయారని, కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని విశాఖకు చెందిన పి.ధనలక్ష్మి, స్కేటింగ్‌లో రాణిస్తున్న తనకు శిక్షణ కోసం ఆర్థిక సహాయం చేయాలని పెదవాల్తేరుకు చెందిన దొంతర గ్రీష్మ, వైసీపీ ప్రభుత్వం తొలగించిన తన వృద్ధాప్య పింఛన్‌ను పునరుద్ధరించాలని సీతంపేటకు చెందిన అవ్వకాంతం, తన భూమి కబ్జా చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని విజయనగరం జిల్లా లక్కవరపు కోటకు చెందిన అంగటి లక్ష్మి, మురళీనగర్‌లో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటుచేయాలని రెసిడెన్స్ అసోసియేషన్ విజ్ఞాపన పత్రాలు అందజేశారు. అర్జీలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ తెలిపారు.

తగరపువలసలో బాలిక ఆత్మహత్యాయత్నం

తగరపువలస, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : భోగాపురం మండలానికి చెందిన ఓ విద్యార్థిని కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల గోస్తనీ నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.భీమిలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. తగరపువలసలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బాలిక సోమవారం సాయంత్రం కళాశాల నుంచి స్నేహితులతో కలిసి ఇంటికి వెళుతూ తగరపువలస వద్ద గోస్తనీ నదిలో దూకింది. స్నేహితులు కేకలు వేయడంతో కొందరు యువకులు నదిలో దూకి ఆమెను రక్షించారు. భీమిలి పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థిని తల్లితో ఫోన్‌లో మాట్లాడి బాలికను వారికి అప్పగించారు. తండ్రికి గుండెపోటు రావడం, తల్లి ఆరోగ్యం బాగాలేకపోవడం, తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఉండడంతో మనస్తాపానికి గురై బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు పోలీసులు చెప్పారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉండడంతో వివరాలు చెప్పడానికి నిరాకరించారు.

ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు విజయవంతం

డాబాగార్డెన్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపి అన్నారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏబీవీపీ మాత్రమే దేశభక్తిని విద్యార్థుల్లో నింపి దేశానికి సమర్థవంతమైన నాయకులను అందిస్తుందన్నారు. మహాసభలలో రాష్ట్రస్థితి , విద్యా స్థితులపై తీర్మానాలు చేశామన్నారు.

నేడు ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి రాక

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ మంగళవారం సాయంత్రం స్టీల్‌ప్లాంటుకు రానున్నారు. బుధవారం ఆయన ఉక్కు కర్మాగారంలో పర్యటిస్తారన్నారు అలాగే ఉక్కు ఉన్నతాధికారులతో సమావేశమయ్యాక ప్లాంట్ అధికారుల సంఘం, కార్మిక సంఘాలు, వివిధ అసోసియేషన్లతో సమావేశం కానున్నారు.

పర్యాటక హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

పర్యాటక రంగం గతి తప్పిందన్నారు. తాము ఆరు నెలల పసికూనలమని, తోడ్పాటు అందిస్తే పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ రంగాన్ని పీ-4 విధానంలో అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారన్నారు. పై స్థాయి నుంచి ఆదేశాలు ఇవ్వకుండా, క్షేత్ర స్థాయి నుంచి సూచనలు తీసుకొని పనిచేయాలని నిర్ణయించామని, అంతా కలిసి ముందుకు రావాలన్నారు. విశాఖను క్రూయిజ్ హబ్‌గా మారుస్తామన్నారు. పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ, సోషల్ మీడియా ద్వారా పర్యాటక ప్రచారం జరగాలని, ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. వాటర్ స్పోర్ట్స్ అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు పెద్దఎత్తున సహకారం అందుతుందన్నారు. ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, పర్యాటకులకు గతంలో తిరుపతి పుణ్యక్షేత్రంలో శీఘ్ర దర్శనం చేయించేవారమని, పత్రికల్లో వ్యతిరేక వార్తలు రావడంతో ప్రభుత్వం ఆ సదుపాయం తీసేసిందని, దీనికి మంచి ఆదరణ ఉన్నందున మళ్లీ పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. యారాడ అందమైన బీచ్ అని దానిని కూడా అభివృద్ధి చేస్తామన్నారు.

400 కి.మీ. 30 బీచ్‌లు అభివృద్ధి

ఏపీటీడీసీ ఎండీ అండ్ వీసీ ఆమ్రపాలి మాట్లాడుతూ కోస్తాలో 400 కి.మీ. పొడవైన సముద్ర తీరంలో 30 కొత్త బీచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు భూముల కేటాయింపులపై రెండు వారాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. విశాఖ, కాకినాడ నగరాలను లీజర్ హబ్‌లుగా గుర్తించి, అభివృద్ధి చేయనున్నామన్నారు. రాయపూర్, కోల్‌కతా, భువనేశ్వర్ ప్రాంతీయులకు వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ఏపీని అభివృద్ధి చేస్తామన్నారు. సుస్థిర పర్యాటకంపైనే దృష్టి పెడుతున్నామన్నారు. ప్రభుత్వం తరపున పోర్టల్ పెడుతున్నామని, ప్రతి ఒక్కరూ రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

అరకు కాఫీకి బ్రాండింగ్

- కల్పనాకుమారి, ఎండీ అండ్ వీసీ, జీసీసీ

అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్ వచ్చేందుకు కృషి చేస్తున్నామని జీసీసీ ఎండీ అండ్ వీసీ కల్పనాకుమారి చెప్పారు. ఏజెన్సీలో కాఫీ పండించడం దగ్గర నుంచి కాఫీ చేయడం వరకూ ఎలా ప్రాసెస్ జరుగుతుందో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ద్వారా వివరిస్తామన్నారు.

చేసిన మంచిని ప్రజలకు చెప్పండి

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా మనలో కసి ఉండాలని, ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. రైల్వే జోన్, విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యలను ఏడు నెలల్లో పరిష్కరించామని, ఉత్తరాంధ్ర ప్రాంతానికి అనేక ఐటీ కంపెనీలను, పరిశ్రమలను తీసుకువస్తున్నామన్నారు. కోటికిపైగా సభ్యత్వ నమోదుతో ఇప్పటికే పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, అదితి గజపతి, వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ, విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గాల అధ్యక్షులు గండి బాబ్జీ, కిమిడి నాగార్జున, జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ దొన్నుదొర, హౌసింగ్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, సీతంరాజు సుధాకర్, కె. రాజబాబు, పీవీఎస్ఎన్ రాజు,చింతకాయల విజయ్, పీలా శ్రీనివాస్, దాడి రత్నాకర్, పాల్గొన్నారు.

ఆ రెండు పోస్టులకు పోటీ

... 5వ పేజీ తరువాయి

కొందరు వైద్య, ఆరోగ్యశాఖా మంత్రిని కలిశారు. అలాగే స్థానికంగా తెలుగుదేశం పార్టీ కీలక నేతను పలువురు కలిసి అవకాశం కల్పించాలని విన్నవించినట్టు చెబుతున్నారు. కొద్దిరోజుల కిందట రాష్ట్రంలోని పలు ఆస్పత్రులకు సూపరింటెండెంట్ పోస్టులను ప్రభుత్వం భర్తీచేసింది. అయితే, కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టును మాత్రం భర్తీ చేయలేదు. వచ్చే నెలలో ఖాళీ కానున్న ప్రిన్సిపాల్ పోస్టుతో కలిపి భర్తీ చేస్తుందని చెబుతున్నారు.

జాబితా పెద్దదే..

సీనియారిటీ జాబితాలో డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ మన్మథరావు, డాక్టర్ వాణితోపాటు మరికొందరు వైద్యులు ఉన్నారు. సీనియారిటీ ప్రకారమే అవకాశం ఇస్తుందన్న నమ్మకంతో వారంతా ఉన్నారు.

వారితోపాటు మరికొందరు కూడా తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఆర్థో, జనరల్ మెడిసిన్‌తోపాటు మరో రెండు విభాగాలకు చెందిన వైద్యులు గట్టిగానే ఈ పోస్టుల కోసం యత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కీలక స్థానాల్లో ఉన్న సీనియర్ వైద్యులు కూడా ఏఎంసీ ప్రిన్సిపాల్, కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదిలావుంటే తాజా సూపరిం టెండెంట్ డాక్టర్ శివానంద కూడా తన సీటును కాపాడుకునే యత్నాల్లో ఉన్నట్టు చెబుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని రూ.75 కోట్ల పనులు రద్దు

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో టెండర్లు పిలిచిన వాటిల్లో 317 పనులను సంబంధిత కాంట్రాక్టర్లు ఇంతవరకూ ప్రారంభించలేదు. గత వైసీపీ ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో తీవ్రమైన జాప్యం చేస్తున్నట్టు తెలుసుకుని పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు సాహసించలేదు. అలా టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులను రద్దు చేయాలని తాజాగా అధికారులు నిర్ణయించారు. రద్దు చేసిన పనుల్లో భవనాలు, బస్‌షెల్టర్‌లు, సెంట్రల్ మీడియన్లు, సామాజిక భవనాలు, ప్రహరీలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, రోడ్లు, డ్రైనేజీల పునర్నిర్మాణం, మరమ్మతులు వంటి ఉన్నాయి. రద్దు చేసిన పనుల్లో ప్రజలకు అవసరమైన వాటికి మళ్లీ అంచనాలు తయారుచేసి, ఉన్నతాధికారులు, మేయర్ దృష్టిలో పెట్టి తిరిగి టెండర్లు పిలుస్తామని జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ శివ ప్రసాదరాజు తెలిపారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ యత్నాలను అడ్డుకుంటాం

- ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి



పోస్టు కార్డులతో రమణమూర్తి, తదితరులు

సిరిపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలకు వ్యతిరేకంగా చేపట్టిన 10 లక్షల పోస్ట్‌కార్డుల ఉద్యమంలో భాగంగా మొదటి విడతగా లక్ష పోస్ట్‌కార్డులను ప్రధాని మోదీకి పంపిస్తున్నామన్నారు. విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించామని, ఇక పరిశ్రమను లాభాల బాట పట్టించాల్సిన బాధ్యత విశాఖ ఉక్కు యాజమాన్యం, కార్మికులపైనే ఉందంటూ తమ బాధ్యత తీరిపోయినట్టుగా నేతలు ప్రకటనలు చేయడం స్టీల్‌ప్లాంట్ అసలు సమస్యను పక్కదారి పట్టించడమేనన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును నష్టాల సాకు చూపించి రూ.లక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్ భూములను అమ్మేయాలని కేంద్రం చూస్తోందన్నారు. దీనిని అంగీకరించేది లేదని ప్రజా సంఘాల తరపున తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లలిత, రాజేంద్ర ప్రసాద్, రవి, రాంప్రభు, ఎస్.వెంకటలక్ష్మి, రూపా, సోదదాసు సుధాకర్, గీత, శ్రీనివాస రావు, చిన్నారావు, బాలనాగమ్మ, రామారావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు ఎన్టీఆర్ కళారాధనా పీఠం అభినందనలు

సిరిపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు లభించడం అభిమానులందరికీ ఆనందదాయమని డా.ఎన్టీఆర్ కళారాధన పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్.స్వామి హర్షం వ్యక్తం చేశారు. తండ్రిలాగే విభిన్న పాత్రల్లో నటిస్తూ నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక నటుడు బాలకృష్ణ అన్నారు. జానపద, పౌరాణిక, చారిత్రక, సాంఘిక చిత్రాల్లో నటించి తనకంటూ ఒక శైలి సృష్టించుకున్న గొప్ప నటుడు అన్నారు.

వెలగని వీధి లైట్లు

ఆరిలోవ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : హనుమంతవాక జంక్షన్ నుంచి దీనదయాళపురం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. ఆ ప్రాంతమంతా చీకటిమయం కావడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు అటువైపు ప్రయాణం చేయలేకపోతున్నారు.

సినిమా గైడ్

- **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు) 24,వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 16, క్యారెట్ 30 దొండకాయలు 40, బంగాళ దుంపలు 23, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)46, బరబాటి 42, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 34,కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండ ఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	495
విజయనగరం	499
శ్రీకాకుళం	499

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

పురుషులకూ డ్వాక్రా సంఘాలు

- జోన్-3లో 70 గ్రూపుల లక్ష్యం
- ఏర్పాటులో యూసీడీ అధికారులు



యూసీడీ కార్యాలయంలో డ్వాక్రా సంఘం వివరాలు అందిస్తున్న సంఘం సభ్యులు

మద్దిలపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థిక పరిపుష్టి చేయడానికి రూపొందించిన డ్వాక్రా సంఘాల మాదిరి ఆర్థికంగా వెనకబడిన పురుషులకు స్వయం ఉపాధి కల్పించడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.పురుషులతో డ్వాక్రా సంఘం ఏర్పాటు చేసి రుణాలు అందివ్వడానికి చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జీవీఎంసీ జోన్-3లో పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు యూసీడీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఒక్కో సంఘానికి అయిదు నుంచి పది మంది వరకు సభ్యులు ఉంటారు. జోన్-3లో 70 సంఘాల ఏర్పాటుకు లక్ష్యం నిర్ణయించగా ఇప్పటికీ 48 సంఘాలు ఖరారయ్యాయి. మిగతా 22 సంఘాల ఏర్పాటుకు ఆర్పీలు ఇంటింటికి వెళ్లి అర్హులైన పురుషులను ఎంపిక చేస్తున్నారు. ఈ సంఘాలకు ముందుగా రూ.10 వేలు నుంచి రూ.15 వేలు రుణం ఇస్తారు. రుణాల చెల్లింపు సక్రమంగా ఉంటే రుణ పరిమితి రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు పెరుగుతుంది. లక్ష్యం పూర్తికాగానే జోన్-3లో నమోదైన డ్వాక్రా సంఘాల సభ్యుల జాబితాను ప్రభుత్వానికి పంపనున్నారు. ఆమోదం రాగానే రుణాల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తారు.

అర్హులు వీరే...

పలు రంగాల్లో పని చేసే కార్మికులు, కూలీలను పురుషుల డ్వాక్రా సంఘాలకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. భవన నిర్మాణ, పారిశుద్ధ్య కార్మికులు, ఎయిర్ కూలర్, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటి గృహోపకరణాల ఎలక్ట్రిషియన్లు, ఆటో, ట్రాలీ రిక్షా కూలీలు, మేకప్ మెన్లు, కేర్ టేకర్స్, కార్పెంటర్లు, ప్లంబర్లు, జొమాటో, స్విగ్గీలలో పనిచేసేవారు అర్హులు. వీరిని ఆర్పీలు గుర్తించి సంఘాలుగా ఏర్పాటు చేస్తారు. వారు తమ వృత్తిలో నైపుణ్యం పెంచుకోవడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తారు.

సంఘాలు ఏర్పాటు ఇలా..

ప్రభుత్వం నిర్ణయించిన వృత్తులు చేపట్టే పురుషులు డ్వాక్రా సంఘంలో చేరడానికి 18 నుంచి 59 ఏళ్ల వయసు వారై ఉండాలి. అర్హత కలిగిన వారిని ఆర్పీలు అయిదు నుంచి పదిమందిని ఒక గ్రూపుగా తీర్మానం చేసి ఇద్దరు లీడర్లుగా నియమిస్తారు. తర్వాత లీడర్ల పేరున బ్యాంక్ ఖాతా తెరుస్తారు. బ్యాంక్ ఖాతా, గ్రూప్ సభ్యుల ఆధార్, తెల్లరేషన్ కార్డుల వివరాలు జోనల్ కార్యాలయంలోని యూసీడీ విభాగంలో అందిస్తారు. అక్కడ నుంచి ప్రతీ నెల గ్రూప్ సభ్యులు తమ సంఘం బ్యాంక్ ఖాతాలో రూ.100 జమ చేయాలి.

ప్రక్రియ ప్రారంభం

జోన్‌లో ఆర్పీల ద్వారా పురుషుల డ్వాక్రా సంఘాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాం.వీరికి రుణాలు మంజూ రవుతాయి. తర్వాత సభ్యుల వృత్తికి తగినట్లుగా రుణ పరిమితి పెరుగుతుంది.

- రాము, ఏపీడీ, జోన్-3.



ఈ ములాకత్‌లో మాట్లాడుతున్న ఖైదీలు

నేటి నుంచి రాజమండ్రికి ఖైదీల తరలింపు

ఆరిలోవ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కేంద్ర కారాగారం నుంచి రాజమండ్రి కారాగారానికి ఖైదీలను పంపే కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నామని డిప్యూటీ జైలు సూపరింటెండెంట్ ఎన్. సాయిప్రవీణ్ తెలిపారు. సుమారు 200 మంది శిక్ష పడిన ఖైదీలను రాజమండ్రికి తరలిస్తామన్నారు. ఇక్కడ సుమారు 2006 మంది ఖైదీలు ఉన్నారని తెలిపారు. ఇక్కడ రద్దీని తగ్గించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తొలిరోజు 30 మందిని గట్టి బందోబస్తు మధ్య బస్సులో పంపుతున్నామని తెలిపారు.వారం రోజుల్లో 200 మందిని తరలిస్తామన్నారు. కాగా కారాగారంలో ఉన్న 250 మంది ఖైదీలను కలవడానికి సోమవారం వారి బంధువులు వచ్చారన్నారు. రిమాండ్ ఖైదీ వారానికి రెండుసార్లు మాట్లాడవచ్చు. అత్యవసర సమయంలో మరో ములాకత్‌గాని అంత కన్న ఎక్కువ గాని కావాలంటే తగిన ఆధారాలను జైలు అధికారులకు చూపించాల్సి ఉంటుందని తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరం (నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపు)లో ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొంటారు. ఎంపికైన వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు అభినందించారు. వీసీ మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకునే వీలుంటుందన్నారు. జాతీయ సమైక్యతా భావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ కేంద్రం కో-ఆర్డినేటర్ ఆచార్య ఎస్. హరనాథ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఏపీకి పంజాబ్ రాష్ట్రాన్ని జతపరిచినట్లు తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి 11 వరకు చండీఘర్ వర్సిటీలో మన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొంటారని, పంజాబ్ నుంచి కూడా వలంటీర్లు ఏపీలో జరగనున్న జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

'ఏయూ ప్రొఫెసర్‌నే వీసీగా నియమించాలి'

వెంకోజీపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో పని చేస్తున్న ప్రొఫెసర్‌నే వీసీగా నియమించాలని ఏయూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం. సురేశ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఘన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం కలిగిన ఏయూ రాష్ట్రంలోనే పురాతన విశ్వవిద్యాలయమని, 99 ఏళ్లు పూర్తి చేసుకుని 2026 ఏప్రిల్ 26లో వందేళ్లు పూర్తి చేసుకోనుందన్నారు. సమర్థులైన స్థానిక ప్రొఫెసర్‌ను నియమించడం ద్వారా శతాబ్ది ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించగలమని లేఖలో పేర్కొన్నారు. యూనివర్సిటీ మీద అవగాహన లేని బయట వ్యక్తిని నియమిస్తే చాలా సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు.

మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచన

మహారాణిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ పెండింగ్ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ గౌరవ అధ్యక్షులు ఆలపాటి గిరిధర్ సూచించారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో న్యాయవాదులు, రిటైర్డు న్యాయమూర్తులకు 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ విదేశాల్లో 90 శాతం కేసులు మధ్యవర్తిత్వం ద్వారానే పరిష్కరిస్తారన్నారు. ఈ విధానంలో పాల్గొనని కక్షిదారులకు అపరాధ రుసుము విధించే ప్రక్రియ తీసుకురావాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న మెలకువలను అవగాహన చేసుకొని కేసుల పరిష్కారానికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నై నుంచి వచ్చిన జాతీయ శిక్షకులు రత్నతార, సత్యారావు, ఎం.వెంకట శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విలు విద్య పోటీలకు దేశయ్య ఎంపిక



దేశయ్యను అభినందిస్తున్న అధ్యాపకులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ విలువిద్య చాంపియన్‌షిప్ పోటీలకు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.దేశయ్య ఎంపికయ్యాడు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రాతినిధ్యం వహించి అద్భుతమైన ఆటతీరుతో రజత పతకం సాధించాడు. ఈ టోర్నీ ఇండియన్ రౌండ్ ఈవెంట్‌లో దేశయ్య 645 పాయింట్లు సాధించి జాతీయ టోర్నీకి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ తన కార్యాలయంలో దేశయ్యను అభినందించి జాతీయ టోర్నీలోనూ పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజు, స్పోర్ట్సు ఇన్‌చార్జి పి.నాగబాబు, ఫిజికల్ డైరక్టర్ ఎస్.అప్పారావు, వై. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు పతకం అందించిన నేపథ్యంలో జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.సూర్యనారాయణరెడ్డి, కె.నిశాంత్, సీనియర్ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

విజయసాయి శిక్ష అనుభవించక తప్పదు

జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

సీతంపేట, జనవరి 27 : రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పినంత మాత్రన కూటమి ప్రభుత్వం విజయసాయిరెడ్డి చేసిన అవినీతి, ఆక్రమణలపై విచారణ చేయక తప్పదని, ఆయన తగిన శిక్ష అనుభవించాల్సిందేనని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ద్వారకానగర్‌లో ఉన్న పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడారు.విజయసాయి రాజీనామా వెనుక పెద్ద డ్రామా నడిచిందని, అతని రాజీనామా జగన్నాటకంలో భాగమేనని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో విజయసాయిరెడ్డి, ఆయన బంధువులు,బినామీలు కలిసి సుమారు రూ. 50 వేల కోట్ల ఆస్తులు దోచుకున్నారని ఆరోపించారు. తనకు గాని, కూతురు అల్లుడుకి గాని విశాఖలో సెంటు భూమి కూడా లేదని విజయసాయిరెడ్డి తెలిపారని, దసపల్లా భూములు సహా భీమిలి తదితర చోట్ల వందల ఎకరాలు దోచుకోవడం వాస్తవం కాదా అన్ని ప్రశ్నించారు. కాకినాడ పోర్టులో దోచుకున్న 42 శాతం వాటాను తిరిగి కేవీ రావుకు ఎలా అప్పగించారో, అలాగే విశాఖ సహా ఉత్తరాంధ్రలో దోచుకున్న ఆస్తులను తిరిగి వెనక్కి ఇచ్చేయాలని డిమాడ్ చేశారు.

అదృశ్యమైన విద్యార్థినిని గుర్తించిన పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా చదవడం లేదని తల్లి మందలించడంతో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. టౌన్‌షిప్‌లో గల ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినితో తల్లి స్కూల్‌కు వెళ్లారు. ఉపాధ్యాయులు సదరు విద్యార్థిని సరిగ్గా చదవడం లేదని తల్లికి తెలపడంతో ఆమె కుమార్తెను మందలించింది. ఆ తర్వాత ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ మార్గమధ్యంలో ఫ్రూట్స్ కొనేందుకు తల్లి వాహనాన్ని ఆపారు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని తల్లి సెల్ ఫోన్, ద్విచక్ర వాహనంతో అక్కడ నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సీఐ కేశవరావు ఆధునిక టెక్నాలజీని వినియోగించి దర్యాప్తు చేపట్టాగా, ఆ విద్యార్థిని ద్విచక్ర వాహనాన్ని సెక్టార్ -11 ప్రాంతంలో విడిచిపెట్టి, అక్కడ నుంచి కారు బుక్ చేసుకొని నగరంలోకి వెళ్లినట్టు గుర్తించారు. ఆ దిశగా దర్యాప్తు చేపట్టి ఎంతో చాకచక్యంగా విద్యార్థినిని పట్టుకుని తల్లికి అప్పగించారు.

వెటరన్స్ టోర్నీ వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తి



టెన్నిస్ పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లు ఎగురవేస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అయిస్టా నిర్వహిస్తున్న 18వ అఖిల భారత సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న క్వాలిఫైయింగ్ రౌండ్ పోటీలకు ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా 18 ఏళ్లుగా టోర్నీని నిర్వహిస్తున్న అయిస్టా ప్రతినిధులు అభినందనీయులన్నారు. 35 నుంచి 75 ఏళ్ల వయసు పైబడిన క్రీడాకారుల మధ్య నిర్వహిస్తున్న ఇటువంటి టోర్నీలు వారిలోని మానసిక ఆరోగ్య సామర్థ్యాన్ని పెంచుతాయన్నారు. దేశ విదేశాల నుంచి సీనియర్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ తదితర ఉన్నత స్థానాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందినవారితో పాటు సర్వీసులో ఉన్న ఉన్నతాధికారులు సైతం అయిస్టా టోర్నీలో ప్రాతినిధ్యం వహించడం విశేషమని పేర్కొన్నారు. క్రీడలకు రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖలో ఇలాంటి టోర్నీలు వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులలో స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు, అయిస్టా ప్రతినిధులు డీఎస్ఎన్.రాజు, ప్రేమ్‌చంద్, సతీష్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని ఇంకా జాగృతం చేయండి

రఘుపాత్రుని బాబ్జీకి కలెక్టర్ సూచన



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రచయిత బాబ్జీ

సిరిపురం , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లఘు చిత్రాలు, కళలు, సాహిత్యం ద్వారా సమాజాన్ని చైతన్యపరిచే దిశగా రఘుపాత్రుని బాబ్జీ మరిన్ని సేవలందించాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు అభిలషించారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాజాన్ని జాగృతం చేస్తున్న రఘుపాత్రుని బాబ్జీకి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ నుంచి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన అధికారులకు, కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశ రావు, అధ్యక్షుడు కాశీవిశ్వేశ్వరరావు, చిన్నారావు, హంసేన్, పలు కళా, సాహిత్య రంగ సంస్థల ప్రతినిధులు బాబ్జీని అభినందించారు.

నాణ్యమైన రహదారులు నిర్మిస్తాం

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు, స్థానిక నాయకులు

ఎం.వి.పి.కాలనీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన రోడ్లు నిర్మించడం తమ మొదటి ప్రాధాన్యత అని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. పదిహేడో వార్డు పరిధిలోని ఎంవీపీ మూడో సెక్టరులో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడచిన అయిదేళ్లలో కనీసం రడ్లపై గోతులు కూడా పూడ్చలేదన్నారు. చాలా వరకూ రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ప్రాధాన్య క్రమంలో అన్ని రహదారులను నిర్మిస్తామన్నారు. రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ రహదారిని నిర్మించనున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, కాళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగులోనే బోధించాలని వినతి



మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలుగు దండు సభ్యులు

సిరిపురం,జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక విద్యా బోధన తప్పనిసరిగా తెలుగు భాషలోనే జరగాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్‌ను తెలుగు దండు సభ్యులు ఉండవిల్లి సుజాత, కొచ్చెర్లకోట సత్యానారాయణమూర్తి, శ్రీధర్, పరవస్తు సూరి కోరారు. నగరంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

'వీవోఏలకు జీతాల బకాయి చెల్లించాలి'

సిరిపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వివోఏలకు ఆరు నెలల జీతాల బకాయి చెల్లించాలని, మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని ఏపీ వెలుగు వివోఏ యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) గౌరవ అధ్యక్షురాలు పి.మణి డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం నిర్వర్తించకపోవడం దుర్మార్గమన్నారు. ఆరు నెలలుగా జీతం ఇవ్వకుండా పని చేయించుకోవడం వెట్టి చాకిరి అవుతుందన్నారు. ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. అక్రమంగా తొలగించిన వివోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, హైకోర్టు తీర్పు అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమన్నారు. వివోఏల సమస్య పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ మూడు రోజుల నిరాహార దీక్షల కార్యక్రమానికి సీఐటీయూ సంపూర్ణ మద్ధతు ఇస్తుందన్నారు. ఈ శిబిరంలో పి.అపర్ణ, ఎం.శ్యామల, పద్మకుమారి, లావణ్య, శ్రీలక్ష్మి, శారద, రమణి పాల్గొనగా కార్యక్రమానికి యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్ష, కార్యదర్శులు అపర్ణ, కంచమ్మ, కోశాధికారి శ్రీలక్ష్మి, వెంటకలక్ష్మి, పార్వతి, శారద నాయకత్వం వహించారు.

ఆత్మీయుడి జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తమలో ఒకడిగా కలిసిమెలిసి తిరిగిన వ్యక్తి ఆకస్మికంగా మరణించడంతో అతని పేరిట క్రికెట్ పోటీలు నిర్వహించి అభిమానం చాటుకున్నారు.16వ వార్డు పాతవెంకోజీపాలెంలో రాధాకృష్ణ యాదవ సేవా సంఘం సభ్యుడు పల్లా పైడిరాజు (50) ఏడు నెలల క్రితం అకస్మాత్తుగా మరణించారు. అతనితో కలిసి షటిల్ ఆడినవారు సంఘం ఆధ్వర్యంలో పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎంవీపీ కాలనీ ఏఎస్‌రాజా మైదానంలో గ్రామంలోని యువకులకు సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు సారథ్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. 6 జట్లు పాల్గొనగా పల్లా పైడిరాజు జట్టు విజయం సాధించింది.

23న ఇండియన్ మ్యాజిక్ అవార్డుల నైట్

వెంకోజీపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మ్యాజిక్ అకాడెమీ దశమ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ ఇంద్ర జాలికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 23న కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ మ్యాజిక్ అవార్డుల నైట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.ఎస్.రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమ గోడ పత్రికను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంద్ర జాలికుడు డాక్టర్ బి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన దేశ, విదేశీ మహేంద్ర జాలికులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు మంత్రికి వివరించారు. పీసీ సర్కార్ తనయుడు జూనియర్ పీసీ సర్కార్‌కు జీవన సాఫల్య పురస్కారం, మరో 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఏ అవార్డులు ఇస్తామన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి ఎంపిక చేసిన ఇంద్రజాల నిపుణుల అబ్బురపరిచే అబ్రకదబ్ర రాష్ట్ర దర్శనల నడుమ ఈ అవార్డుల దినోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యవర్గం, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, మెజీషియన్లు విజయ్‌కుమార్, ఎంఏ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచన

మహారాణిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ పెండింగ్ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ గౌరవ అధ్యక్షులు అలపాటి గిరిధర్ సూచించారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో న్యాయవాదులు, రిటైర్డు న్యాయమూర్తులకు 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ అధ్యక్షోపన్యాసం చేస్తూ విదేశాల్లో 90 శాతం కేసులు మధ్యవర్తిత్వం ద్వారానే పరిష్కరిస్తారన్నారు. ఈ విధానంలో పాల్గొనని కక్షిదారులకు అపరాధ రుసుము విధించే ప్రక్రియ తీసుకురావాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న మెలకువలను అవగాహన చేసుకొని కేసుల పరిష్కారానికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెన్నై నుంచి వచ్చిన జాతీయ శిక్షకులు రత్నతార, సత్యారావు, ఎం.వెంకట శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. తాటిచెట్లపాలెం, రైల్వేక్వార్టర్స్, రైల్వే ఆక్వా స్పోర్ట్స్ ఏరియా, రెడ్డి తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ, శివాలయం, రామాలయం వీధులు, వేంకటేశ్వర కాలనీ, ఎనభై అడుగుల రోడ్డు, పట్నాయక్ వీధి, 28 బస్టాప్ రోడ్డు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

మహారాణిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదువుతున్న తమ కుమారుడు ఇంటి నుంచి వెళ్లి కనిపించడం లేదని అతని తల్లిదండ్రులు మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంగటిదిబ్బ ప్రాంతంలో బొట్టా గౌతమ్ (21) అతని తల్లి దండ్రులతో కలసి నివాసం ఉంటున్నాడు.



అదృశ్యమైన గౌతమ్

ఆంధ్రా యూనివ ర్సిటీ లో కంప్యూటర్ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మూడేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో గౌతమ్ తల, కాలుకి గాయాలు తగిలాయి. ఈ క్రమంలో కొంత మతిస్థిమితం తప్పాడు. చికిత్స పొందాక ఆరోగ్యం కుదుటపడడంతో బాగానే చదివేవాడు. కాలికి గాయం కారణంగా సరిగా నడవలేక మానసికంగా ఇబ్బందిపడేవాడు. ఈ క్రమంలో ఏం జరిగిందో గాని, సోమవారం ఉదయం ఇంటిలో ఎవరికీ చెప్పకుండా మొబైల్ సైతం వదిలి వెళ్లిపోయాడని అతని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నిచోట్ల వెతికినా ఆచూకీ లభ్యంకానందున పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు అతని ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు

మురళీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు యువత అవగాహన పెంచుకోవాలని సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన సదస్సులో విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. హెల్మెట్ ధరించడం, లైసెన్స్ పొందటం, పరిమిత వేగంపై యువత అప్రమత్తత పాటించాలన్నారు. గోపాలపట్నంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నరేష్, అనిల్ హాజరయ్యారు.

'విజయసాయిరెడ్డి శిక్ష అనుభవించక తప్పదు'

సీతంపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించినంతమాత్రాన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన అక్రమాలు, కబ్జాలపై విచారణ, శిక్ష అనుభించక తప్పదని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి సాక్షిగా అబద్ధం ఆడనని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్నాటకంలో భాగమే అతని రాజీడ్రామా అని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉత్తరాంధ్రలో విజయసాయి రెడ్డి, ఆయన బంధువులు, బినామీలు కలిసి సుమారు రూ.50 వేల కోట్ల ఆస్తులు దోచుకున్నారని ఆరోపించారు. పశ్చాత్తాపం ఉంటే దోచుకున్న ఆస్తులు ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. దసపల్లా, భీమిలి తదితర చోట్ల వందల ఎకరాల భూమి దోచుకోవడం వాస్తవం కాదా? దేవదాయ శాఖ ఉద్యోగిని శాంతితో కలిసి దేవదాయ, మాన్సాస్ భూములు కొట్టేయడం వాస్తవం కాదా? ఆ భూములు తిరిగి ఇచ్చేస్తారా అన్నారు. 22, 23 సీబీఐ కేసులున్న విజయసాయి తన స్నేహితుడు పవన్ కల్యాణ్ అని చెప్పడం సిగ్గుచేటని మూర్తి యాదవ్ విమర్శించారు.

విస్తరణకు నోచుకోని రైతుబజార్



కంచరపాలెంలో నేలపైనే రైతుల దుకాణాలు

కంచరపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం రైతు బజారులో ప్రజలు, రైతులకు సరిపడా దుకాణాలు అందుబాటులో లేక సమస్యలు తప్పడం లేదు. బజారులో రైతులు 229 మంది, డ్వాక్రా సభ్యులు, దివ్యాంగులు కలిపి 14 మంది, గృహమిత్ర, సూపర్ బజారు, వీసీసీ, డెయిరీ కోసం ఒక్కొక్కరు కలిపి 248 మంది ఉన్నారు. వీరికి కేవలం 114 దుకాణాలు అందుబాటులో ఉన్నాయి. బజారులో దుకాణాల చాలక చాలా మంది రైతులు నేలమీదే వ్యాపారం నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో రైతులతో పాటు కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కంచరపాలెంలో రైతుబజారును రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. అప్పటి అవసరాలకు తగ్గట్టుగా దుకాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నగరంలో అత్యంత ఆదరణ చూరగొన్న రెండో రైతు బజారుగా కంచరపాలెం పేరుపొందింది. కంచరపాలెం, మర్రిపాలెం, మాధవధార, జ్ఞానాపురం, ఎన్ఏడీ తదితర ప్రాంతాల నుంచి నిత్యం వందలాదిమంది రాకతో బజారు రద్దీగా ఉంటుంది. అయితే అవసరమైనన్ని దుకాణాలు లేకపోవడంతో సగం మంది పైన, చాలా మంది రైతులు నేలమీదే పోగులు పోసి విక్రయిస్తున్నారు. ఫలితంగా తాజా కూరగాయలు పాడై నష్టం జరుగుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం స్టాల్స్ నిర్మించడంతో కొన్ని దెబ్బతిన్నాయి. ప్రస్తుతం రైతు బజారులో రద్దీ, కొనుగోలుదారుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని సంస్కరణలు చేపటాలని కోరుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి బజారులో అదనపు దుకాణాల ఏర్పాటు, ఇతర సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు కానరాని ఆదరణ

బజారులో సేంద్రియ (ఆర్గానిక్) ఉత్పత్తుల విక్రయాల కోసం ట్రక్ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఈ దుకాణానికి కొనుగోలుదారుల నుంచి ఆదరణ లేకపోవడంతో బజారులో ఉన్న స్థలం నిరుపయోగమైందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న దుకాణాలకు ఆనుకుని కొంత స్థలం బజారు చుట్టూ నిరుపయోగంగా ఉంది. బజారు విస్తరణకు ప్రణాళికను రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే భవిష్యత్‌లో మరింత ఆదరణ, డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందని, ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు



ఫిర్యాదు పరిశీలిస్తున్న జడ్సీ మల్లయ్య నాయుడు

జ్ఞానాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని జోన్-4, జోన్-5 కార్యాలయాల్లో సోమవారం సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు ఫిర్యాదులు చేశారు. జోన్-4 కార్యాలయానికి టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగాలకు సంబంధించి ఒక్కొక్క ఫిర్యాదు జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు స్వీకరించారు. జోన్-5లో టౌన్ ప్లానింగ్ 5, రెవెన్యూ 1 చొప్పున ఫిర్యాదులను సూపర్‌వైజర్ టీఎస్ఎస్ రాజు స్వీకరించారు. ఏఎంహెచ్‌వోలు కృష్ణంరాజు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార తహసీల్దార్, ఆర్ఐపై ఫిర్యాదు

డాబాగార్డెన్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ జేసీ మయూర్ అశోక్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం మారినా అధికారులు తప్పుడు పనులు చేయడం మానలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కంచరపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 54వ వార్డు పరిధి వివేకానంద వీధి, శ్రీ నగర్, దేవేంద్ర నగర్‌లలో అభివృద్ధి పనులకు బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ గ్రామాల్లో రోడ్లు గతుకులమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. నూతనంగా సీసీ రోడ్లు వేయనున్నారు. అనంతరం శ్యామలా దీపిక సమీపంలోని బీజేపీ కార్యకర్త గుప్తా ఇంటికి వెళ్లి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా రజని, కో కన్వీనర్ రంగుముద్ర రాంబాబు, నాయకులు శేఖర్, భాస్కర్, దుర్గాప్రసాద్, ఆదిలక్ష్మి, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వెటరన్స్ టోర్నీ వర్ధమాన క్రీడాకారులకు స్ఫూర్తి



టెన్నిస్ పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లు ఎగురవేస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అయిస్టా నిర్వహిస్తున్న 18వ అఖిల భారత సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరుగుతున్న క్వాలిఫైయింగ్ రౌండ్ పోటీలకు ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా క్రమం తప్పకుండా 18 ఏళ్లుగా టోర్నీని నిర్వహిస్తున్న అయిస్టా ప్రతినిధులు అభినందనీయులన్నారు. 35 నుంచి 75 ఏళ్ల వయసు పైబడిన క్రీడాకారుల మధ్య నిర్వహిస్తున్న ఇటువంటి టోర్నీలు వారిలోని మానసిక ఆరోగ్య సామర్థ్యాన్ని పెంచుతాయన్నారు. దేశ విదేశాల నుంచి సీనియర్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ తదితర ఉన్నత స్థానాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందినవారితోపాటు సర్వీసులో ఉన్న ఉన్నతాధికారులు సైతం అయిస్టా టోర్నీలో ప్రాతినిధ్యం వహించడం విశేషమని పేర్కొన్నారు. క్రీడలకు రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖలో ఇలాంటి టోర్నీలు వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులలో స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మాజీ డీజీపీ ఎస్.సాంబశివరావు, అయిస్టా ప్రతినిధులు డీఎస్ఎన్.రాజు, ప్రేమ్‌చంద్, సతీష్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సీఎండీకి వినతి



'సీఎండీ పృథ్వీతేజకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు

కంచరపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వవార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో అంధకారం సమస్యపై ఆ వార్డు కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు సోమవారం ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొండవాలు గ్రామాలైన బాపూజీ నగర్, పల్నాటి కాలనీ, శ్రీనివాసనగర్, రాంజీ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, లైట్లు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. వీధి దీపాలు లేక దొంగలు, ఆకతాయిల బెడదతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.సంబంధిత అధికారులకు ఆదేశించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు విజయవంతం: గోపి

డాబాగార్డెన్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్‌లో విజయవంతంగా నిర్వహించినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపి అన్నారు. ఏబీవీపీ మాత్రమే దేశభక్తిని విద్యార్థులలో నింపి సమర్థులైన నాయకులను అందిస్తుందన్నారు. నటుడు శ్రీకాంత్, సయ్యద్ షహనాజ్, చల్లా రాజేంద్రప్రసాద్ , అంబటి రాయుడులను సత్కరించామన్నారు.

జాతీయ విలువిద్య పోటీలకు దేశయ్య ఎంపిక



దేశయ్యతో ఆర్చరీ ప్రముఖులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ విలువిద్య చాంపియన్‌షిప్ పోటీలకు అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.దేశయ్య ఎంపికయ్యాడు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రాతినిధ్యం వహించి అద్భుతమైన ఆటతీరుతో రజత పతకం సాధించాడు. ఈ టోర్నీ ఇండియన్ రౌండ్ ఈవెంట్‌లో దేశయ్య 645 పాయింట్లు సాధించి జాతీయ టోర్నీకి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ తన కార్యాలయంలో దేశయ్యను అభినందించి జాతీయ టోర్నీలోనూ పతకం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజు, స్పోర్ట్సు ఇన్‌చార్జి పి.నాగబాబు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్.అప్పారావు, వై.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు పతకం అందించిన నేపథ్యంలో జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.సూర్యనారాయణరెడ్డి, కె.నిశాంత్, సీనియర్ ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు హర్షం ప్రకటించారు.

'ఉద్యమాలకు బాలానంద్ స్ఫూర్తి'



మాట్లాడుతున్న సిటు నాయకుడు నరసింగరావు

జగదాంబ కూడలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బాలానంద్ స్ఫూర్తితో సరళీకరణ విధానాలపై పోరాడుదామని సీఐటీయూ నాయకుడు సి.హెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో సిటు అఖిల భారత మాజీ అధ్యక్షుడు ఇ.బాలానంద్ శతజయంతి సభలో మాట్లాడారు. బాలానంద్ జీవితాన్ని కార్మికుల ప్రయోజనాలకు అంకితం చేశారన్నారు కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. అత్యయిక పరిస్థితి కాలంలో ప్రభుత్వ నిరంకుశ, నిర్బంధ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. బాలానంద్ స్ఫూర్తితో కార్మిక పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సిటు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు కుమార్, కె.ఎం. శ్రీనివాస్ తదితరులు ఘన నివాళుల ర్పించారు. ఈ సభలో జ్యోతీశ్వరరావు జగన్, మణి, సుబ్బారావు, వై.రాజు, నూకరాజు, రామస్వామి పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

డాబాగార్డెన్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆర్‌డబ్ల్యూటీఎస్ మనోహరన్ అన్నారు.. సోమవారం సెయింట్ ఎలాసియస్ స్కూల్ ఆవరణలో లాడ్జ్ యూనివర్సిటీ 142 విశాఖపట్నం ఆధ్వర్యంలో 'హ్యాపీ న్యూయర్.. హెల్తీ న్యూయర్' పేరిట ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు, స్థానిక ప్రజలకు మెడికవర్, అపోలో ఆస్పత్రుల సౌజన్యంతో ఉచితంగా కేన్సర్, పాప్‌స్మెర్, చిన్నారుల వ్యాధులపై అవగాహన కల్పించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మర్రిపాలెంలోని తమ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్) మర్రిపాలెం పోస్టు సిబ్బంది పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొని తమ ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ మర్రిపాలెం పోస్టు అధికారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై తమ నిబద్ధతకు గుర్తుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. పచ్చదనం, పర్యావరణంతో ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా చేపట్టాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో జాతీయ దృక్పథాన్ని చాటుకోవడమే కాకుండా సమాజ సంక్షేమానికి తోడ్పడడంలో భాగంగా సాధారణ విధులకు మించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావడం ఆర్పీఎఫ్ అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు కొనసాగించడం నిబద్ధతను చాటుతాయని అభిప్రాయపడ్డారు.

లోకేష్ ప్రజా దర్బార్

- పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరణ
- ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామని హామీ

మహారాణిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటామని, అండగా నిలుస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో 57వ ప్రజా దర్బార్ నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కశింకోట ప్రాంతానికి చెందిన ప్రభాకర్ తన మూడేళ్ల కుమార్తె అనారోగ్యానికి గురైందని వైద్య చికిత్సకు సాయం అందించాలని లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. వీఎంఆర్‌డీఏలో విధులు నిర్వహిస్తూ తన భర్త చనిపోయారని, కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని విశాఖకు చెందిన పి.ధనలక్ష్మి, స్కేటింగ్‌లో రాణిస్తున్న తనకు శిక్షణ కోసం ఆర్థిక సహాయం చేయాలని పెదవాల్తేరుకు చెందిన దొంతర గ్రీష్మ, వైసీపీ ప్రభుత్వం తొలగించిన తన వృద్ధాప్య పింఛన్‌ను పునరుద్ధరించాలని సీతంపేటకు చెందిన అవ్వకాంతం, తన భూమి కబ్జా చేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలని విజయనగరం జిల్లా లక్కవరపు కోటకు చెందిన అంగటి లక్ష్మి, మురళీనగర్‌లో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటుచేయాలని రెసిడెన్స్ అసోసియేషన్ విజ్ఞాపన పత్రాలు అందజేశారు. అర్జీలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ తెలిపారు.

అంబేడ్కర్ కూడలిలో బస్టాప్ లేపేశారు!



డాబాగార్డెన్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

డాబాగార్డెన్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అదో ముఖ్యమైన ప్రాంతం... కొన్ని సంవత్సరాలుగా ఆర్టీసీ బస్‌స్టాప్ ఉండేది. అయితే దీన్ని తొలుత కుదించి, తరువాత కాలంలో బస్‌స్టాప్‌నే పూర్తిగా తొలగించేశారు. డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద పరిస్థితి ఇది. ఇప్పుడు రోడ్డు తప్ప అక్కడ మరేమీ లేదు. కొందరు వృద్ధులు, మహిళలు, విద్యార్థులు నిలువ నీడ లేక ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని అంబేడ్కర్ సర్కిల్‌కు ఇరువైపులా బస్‌స్టాప్ సౌకర్యంగా ఉండేది. స్థానికంగా ఉన్న వస్త్ర దుకాణం ఎదుట ఉండే ఆర్టీసీ బస్‌స్టాప్‌లో నిత్యం పెద్ద సంఖ్యలో విద్యార్థినులు, మహిళలు నిరీక్షించి తమ గమ్యస్థానాలకు వెళ్లే బస్సు రాగానే అందులో ప్రయాణంచేవారు. ఎందుకో గాని ఇప్పుడు బస్‌స్టాప్ ఉందనే ఆనవాలు సైతం లేకుండా చేశారు. కొన్ని వాణిజ్య సముదాయాలకు ఇబ్బందిగా ఉందనో, లేక దిష్టిబొమ్మలా ఉందనుకున్నారో.. బస్ షెల్టర్‌ను పూర్తిగా తొలగించేశారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యార్థినులు, మహిళలు, వృద్ధులు ఎండైనా...వానైనా...చలి అయినా... తట్టుకుని రోడ్డుపైనే నిల్చుని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు నెలల్లో వేసవి కాలం సమీపిస్తోంది. మండుటెండలో ప్రయాణికులు నిల్చోలేని పరిస్థితి ఎదురవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు బస్‌స్టాప్‌ను మళ్లీ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆ రెండు పోస్టులకు పోటీ

... 5వ పేజీ తరువాయి

కొందరు వైద్య, ఆరోగ్యశాఖా మంత్రిని కలిశారు. స్థానికంగా టీడీపీ కీలక నేతను పలువురు కలిసి అవకాశం కల్పించాలని విన్నవించినట్టు చెబుతున్నారు. కొద్దిరోజుల కిందట రాష్ట్రంలోని పలు ఆస్పత్రులకు సూపరింటెండెంట్ పోస్టులను ప్రభుత్వం భర్తీచేసింది. కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టును మాత్రం భర్తీ చేయలేదు. వచ్చే నెలలో ఖాళీ కానున్న ప్రిన్సిపాల్ పోస్టుతో కలిపి భర్తీ చేస్తుందని చెబుతున్నారు.

జాబితా పెద్దదే..

సీనియారిటీ జాబితాలో డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ మన్మథరావు, డాక్టర్ వాణితోపాటు మరికొందరు వైద్యులు ఉన్నారు. సీనియారిటీ ప్రకారమే అవకాశం ఇస్తుందన్న నమ్మకంతో వారంతా ఉన్నారు. వారితోపాటు మరికొందరు కూడా తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఆర్థో, జనరల్ మెడిసిన్‌తోపాటు మరో రెండు విభాగాలకు చెందిన వైద్యులు గట్టిగానే ఈ పోస్టులు కోసం యత్నిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కీలక స్థానాల్లో ఉన్న సీనియర్ వైద్యులు కూడా ఏఎంసీ ప్రిన్సిపాల్, కేజీహెచ్ సూపరింటెండెంట్ పోస్టుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదిలావుంటే తాజా సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద కూడా తన సీటును కాపాడుకునే యత్నాల్లో ఉన్నట్టు చెబుతున్నారు.

చేసిన మంచిని ప్రజలకు చెప్పండి

... 5వ పేజీ తరువాయి

కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా మనలో కసి ఉండాలని, ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలన్నారు. రైల్వే జోన్, విశాఖ ఉక్కు కర్మాగారం సమస్యలను ఏడు నెలల్లో పరిష్కరించామని, ఉత్తరాంధ్ర ప్రాంతానికి అనేక ఐటీ కంపెనీలను, పరిశ్రమలను తీసుకువస్తున్నామన్నారు. కోటికిపైగా సభ్యత్వ నమోదుతో ఇప్పటికే పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, అదితి గజపతి, వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ, విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గాల అధ్యక్షులు గండి బాబ్జీ, కిమిడి నాగార్జున, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొర, హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, సీతంరాజు సుధాకర్, కోరాడ రాజబాబు, పీవీఎస్ఎన్‌రాజు, చింతకాయల విజయ్, పీలాశ్రీనివాస్, దాడిరత్నాకర్ పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని రూ.75 కోట్ల పనులు రద్దు

... 5వ పేజీ తరువాయి

పరిధిలో 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో టెండర్లు పిలిచిన వాటిల్లో 317 పనులను సంబంధిత కాంట్రాక్టర్లు ఇంతవరకూ ప్రారంభించలేదు. గత వైసీపీ ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో తీవ్రమైన జాప్యం చేస్తున్నట్టు తెలుసుకుని పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు సాహసించలేదు. అలా టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని పనులను రద్దు చేయాలని తాజాగా అధికారులు నిర్ణయించారు. రద్దు చేసిన పనుల్లో భవనాలు, బస్‌షెల్టర్‌లు, సెంట్రల్ మీడియన్లు, సామాజిక భవనాలు, ప్రహరీలు, ఫుట్‌పాత్‌లు, పార్కులు, రోడ్లు, డ్రైనేజీల పునర్నిర్మాణం, మరమ్మతులు వంటి ఉన్నాయి. రద్దు చేసిన పనుల్లో ప్రజలకు అవసరమైన వాటికి మళ్లీ అంచనాలు తయారుచేసి, ఉన్నతాధికారులు, మేయర్ దృష్టిలో పెట్టి తిరిగి టెండర్లు పిలుస్తామని జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ శివప్రసాదరాజు తెలిపారు.

పర్యాటక హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

పర్యాటక రంగం గతి తప్పిందన్నారు. తాము ఆరు నెలల పసికూనలమని, తోడ్పాటు అందిస్తే పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ రంగాన్ని పీ-4 విధానంలో అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారన్నారు. పై స్థాయి నుంచి ఆదేశాలు ఇవ్వకుండా, క్షేత్ర స్థాయి నుంచి సూచనలు తీసుకొని పనిచేయాలని నిర్ణయించామని, అంతా కలిసి ముందుకు రావాలన్నారు. విశాఖను క్రూయిజ్ హబ్‌గా మారుస్తామన్నారు. పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ, సోషల్ మీడియా ద్వారా పర్యాటక ప్రచారం జరగాలని, ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. వాటర్ స్పోర్ట్స్ అడ్వంచర్ స్పోర్ట్స్‌కు పెద్దఎత్తున సహకారం అందుతుందన్నారు. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, పర్యాటకులకు గతంలో తిరుపతి పుణ్యక్షేత్రంలో శీఘ్ర దర్శనం చేయించేవారమని, పత్రికల్లో వ్యతిరేక వార్తలు రావడంతో ప్రభుత్వం ఆ సదుపాయం తీసేసిందని, దీనికి మంచి ఆదరణ ఉన్నందున మళ్లీ పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. యారాడ అందమైన బీచ్ అని దానిని కూడా అభివృద్ధి చేస్తామన్నారు.

400 కి.మీ. 30 బీచ్‌లు అభివృద్ధి

ఏపీటీడీసీ ఎండీ అండ్ వీసీ ఆమ్రపాలి మాట్లాడుతూ కోస్తాలో 400 కి.మీ. పొడవైన సముద్ర తీరంలో 30 కొత్త బీచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు భూముల కేటాయింపులపై రెండు వారాల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. విశాఖ, కాకినాడ నగరాలను లీజర్ హబ్‌లుగా గుర్తించి, అభివృద్ధి చేయనున్నామన్నారు. రాయపూర్, కోల్‌కతా, భువనేశ్వర్ ప్రాంతీయులకు వెడ్డింగ్ డెస్టినేషన్‌గా ఏపీని అభివృద్ధి చేస్తామన్నారు. సుస్థిర పర్యాటకంపైనే దృష్టి పెడుతున్నామన్నారు. ప్రభుత్వం తరపున పోర్టల్ పెడుతున్నామని, ప్రతి ఒక్కరూ రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

అరకు కాఫీకి బ్రాండింగ్

అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా బ్రాండింగ్ వచ్చేందుకు కృషి చేస్తున్నామని జీసీసీ ఎండీ అండ్ వీసీ కల్పనాకుమారి చెప్పారు. ఏజెన్సీలో కాఫీ పండించడం దగ్గర నుంచి కాఫీ చేయడం వరకూ ఎలా ప్రాసెస్ జరుగుతుందో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ద్వారా వివరిస్తామన్నారు.

- కల్పనాకుమారి, ఎండీ అండ్ వీసీ, జీసీసీ

ఉన్న భవనాన్ని కూల్చారు.. కొత్త నిర్మాణాన్ని ఆపారు!

- తరగతి గదుల లేమితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నడుపూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు
- నేలబారు చదువులు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
- ప్రజాప్రతినిధులు, జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించాలని వేడుకోలు

పెదగంట్యాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) 76వ వార్డు పరిధిలోని నడుపూరు ప్రాథమిక పాఠశాలకు ప్రాథమిక వసతులు కొరవడ్డాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 136 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో మూడే తరగతి గదులు ఉన్నాయి. ఇందులో ఒకటి ప్రధానోపాధ్యాయుని గదిగా, స్టోర్ రూమ్, ఒకటో తరగతి విద్యార్థుల క్లాస్ రూంగా ఉంది. మిగిలిన రెండు గదుల్లోనూ రెండేసి తరగతుల చొప్పున కాసులు చెబుతున్నారు. ఈ క్రమలోట ఒక తరగతి విద్యార్థులు గదిలో ఉంటే మరో తరగతి విద్యార్థులు వరండాలో ఉంటున్నారు. పాఠశాలలో ఉన్న ఐదుగురు ఉపాధ్యాయులు కూడా ఇలాంటి అసౌకర్యాల నడుమే పిల్లలకు విద్యా బోధన చేస్తున్నారు. పాఠశాలలో ఫర్నీచర్ కూడా అరకొరగానే ఉంది. 30 శాతం మంది విద్యార్థులు మాత్రమే కూర్చొనేందుకు బెంచీలు ఉన్నాయి. మిగిలిన వారంతా నేలపై కూర్చునే చదువుకుంటున్నారు.

నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలకు మూడు అదనపు తరగతి గదులను నిర్మించేందుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 36 లక్షలు, ప్రహరీ, ఇతర అదనపు పనుల కోసం రూ.20 లక్షలు వ్యయం కాగలదని అంచనా రూపొందించారు. స్కూల్ పక్కనే ఉన్న రెండు తరగతి గదుల భవనాన్ని కూల్చివేసి అక్కడ మూడు గదులతో కూడిన భవంతిని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు వెంటనే ఆ భవనాన్ని తొలగించారు. అయితే నాటి ప్రభుత్వం నిధుల మంజూరు చేయడంలో జాప్యం చోటుచేసుకుంది. ఎట్టకేలకు మొదటి విడతగా రూ.ఎనిమిది లక్షలు, ఆ తర్వాత రెండేసి రూ.లక్షలు చొప్పున రెండు విడతలు మంజూరు కావడంతో భవన నిర్మాణానికి కాలమ్స్ వేశారు. ఆ తర్వాత నిధుల లేమితో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఉన్న రెండు తరగతులతో కూడిన భవనాన్ని కూడా కొత్తది నిర్మిస్తామని కూల్చివేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు మరింత అధికమయ్యాయి. అందువల్ల ప్రజాప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


నేలపై కూర్చుని చదువుతున్న విద్యార్థులు


నిలిచిపోయిన అదనపు భవన నిర్మాణం


అగనంపూడిలో సోమవారం ఉదయం కురిసిన పొగ మంచు

అగనంపూడిని కమ్మేసిన పొగ మంచు

అగనంపూడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన అగనంపూడి పరిసరాలు సోమవారం ఏజెన్సీ ప్రాంతాన్ని తలపించాయి. గ్రామాలను దట్టంగా పొగ మంచు దట్టంగా కమ్మేసింది. అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి ఉదయం 8.30 గంటల వరకు విపరీతంగా పొగ మంచు కురిసింది. ఈ కారణంగా ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లు సరిగ్గా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులందరూ హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. మంచు వల్ల విధులకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు, స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చలికి వణికిపోయారు.

సోమనాథేశ్వర వజ్రలింగ రథయాత్రకు ఘన స్వాగతం


రథానికి స్వాగతం పలుకుతున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు

అగనంపూడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సోమనాథేశ్వర వజ్రలింగ రథయాత్ర సోమవారం అగనంపూడికి చేరుకుంది. జాబిలి హిల్స్ కాలనీలో గల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద రథానికి బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. పరిసర ప్రాంతాల భక్తులు సోమనాథేశ్వర వజ్ర లింగాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వేపచెట్టు జంక్షన్, గల్లవానిపాలెం, శాంతినగర్, శ్రీనివాసనగర్ మీదుగా రతయాత్ర సాగింది. కార్యక్రమంలో టీడీపీ 79వ వార్డు అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ, నాయకులు మణి, సుభాశ్, ఆంజనేయులు, రామలక్ష్మి, బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థినిని పట్టుకున్న పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సరిగ్గా చదవడం లేదని తల్లి మందలించడంతో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. టౌన్‌షిప్‌లో గల ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినితో కలిసి తల్లి సోమవారం స్కూల్‌కు వెళ్లారు. ఉపాధ్యాయులు సదరు విద్యార్థిని సరిగ్గా చదవడం లేదని తల్లికి తెలపడంతో ఆమె కుమార్తెను మందలించారు. ఆ తర్వాత ఇద్దరూ ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ మార్గమధ్యంలో ఫ్రూట్స్ కొనేందుకు తల్లి వాహనాన్ని ఆపారు. ఈ క్రమంలో ఆ విద్యార్థిని తల్లి సెల్ ఫోన్, ద్విచక్ర వాహనంతో అక్కడ నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె స్టీల్ ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన సీఐ కేశవరావు ఆధునిక టెక్నాలజీని వినియోగించి దర్యాప్తు చేపట్టగా, ఆ విద్యార్థిని ద్విచక్ర వాహనాన్ని సెక్టార్-11 ప్రాంతంలో విడిచిపెట్టి, అక్కడ నుంచి కారు బుక్ చేసుకుని నగరంలోకి వెళ్లినట్టు గుర్తించారు. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేపట్టి ఎంతో చాకచక్యంగా విద్యార్థినిని పట్టుకుని తల్లికి అప్పగించారు.


వినతులను పరిశీలిస్తున్న జడ్సీ శేషాద్రి

పీజీఆర్ఎస్‌కు 24 వినతులు

గాజువాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 24 వినతులు వచ్చాయి. వీధి లైట్లు వెలిగేలా చూడాలని, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని, రహదారులపై ఉన్న గోతులను పూడ్చాలని, తదితర సమస్యలతో పలువురు వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ పారిశుధ్య కార్మికులు వేడుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జడ్సీ శేషాద్రి ఆదేశించారు.

నేడు ఇంటక్ ఆధ్వర్యంలో ధర్నా

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించడంలో యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం టీటీఐ జంక్షన్ వద్ద ధర్నా చేయనున్నట్టు ఇంటక్ ఉక్కు అధ్యక్షుడు పీవీ రమణమూర్తి తెలిపారు. నెలల తరబడి జీతాలు అందరకు ఉద్యోగులు, కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో ఉక్కు ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా కోరారు.

గోకార్ట్ చాంపియన్‌షిప్‌లో విజ్ఞాన్ జట్టు ప్రతిభ


విజేతలుగా నిలిచిన టీమ్ రుద్ర సభ్యులు

అగనంపూడి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భీమవరంలో జరిగిన గోకార్ట్ చాంపియన్‌షిప్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం జట్టు (టీం రుద్ర) వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి అవార్డులను సాధించింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె. సుధాకర్ జట్టు సభ్యులను అభినందించారు. గోకార్ట్ చాంపియన్‌షిప్‌లో టీం రుద్ర విజయాలను సాధించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ వి.మధుసూదనరావు, డీన్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్పందన చేయూత ఫౌండేషన్ సేవలు అభినందనీయం


కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామీజీ

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సేవే పరమావధిగా స్పందన చేయూత ఫౌండేషన్ నడుస్తుండడం అభినందనీయమని శ్రీసత్యసాయి దివ్యామృతం స్వామీజీ అన్నారు. ఫౌండేషన్ వార్షికోత్సవం ఉక్కు అధికారుల సంఘం భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం, వైద్యం, విపత్తు సమయంలో ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయం, అన్నదానం వంటివి చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం అనాథ శవాలను అంత్యక్రియల కోసం తరలించేందుకు గాను మారుతి వ్యాన్‌ను అనకాపల్లిలో గల దేవా ఫౌండేషన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, ఫౌండేషన్ చైర్మన్ ఈపూరి బుచ్చిరాజు, ప్రతినిధులు కలిదిండి రవి, కృష్ణంరాజు, రామకుమారి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి అందరూ సహకరించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులకు సహకరించినప్పుడే కాలనీలు అభివృద్ధి చెందుతాయని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. వెంకటేశ్వర కాలనీ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటువంటి వార్షికోత్సవాలను కాలనీల్లో నిర్వహించడం వల్ల ప్రజల మధ్య ఆత్మీయ స్నేహ బంధాలు బలపడతాయన్నారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు ఎ.వీర్రాజు, పి.పార్వతీశం, జీవన్‌బాబు, యువశ్రీ, వీరశేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దివాస్

గాజువాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యంగం ప్రజలకు విలువైన హక్కులను కల్పించిందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో రాజ్యంగ దివాస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగునంగా పీఎం మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు దోని నాగరాజు, నాయకులు ములకలపల్లి ప్రకాశ్, ముసలయ్య, పెంటారావు, వంశీ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 16, క్యారెట్ 30, దొండకాయలు 40, బంగాళదుంపలు 23, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 46, బరబాటి 42, మునక్కాడలు (కిలో) 110, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 34, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 56, దేముడుచిక్కుడు 36, గోరుచిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	495
విజయనగరం	499
శ్రీకాకుళం	499

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

మన్యాన్ని తలపిస్తున్న శివారు ప్రాంతాలు

- ఉదయం 8 గంటల వరకు వీడని మంచు

గోపాలపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలైన నరవ, కోటనరవలో వాతావరణం మన్యాన్ని తలపిస్తోంది. గోపాలపట్నం కూడలికి చేరువలో ఉన్న ఈ ప్రాంతంలో వాతావరణం విభిన్నంగా ఉండడంతో ప్రజలు ప్రత్యేక అనుభూతి చెందుతున్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో జనావాసాలు ఎక్కువగా ఉండడంతో పొగ మంచు కనిపించదు. నరవ, కోటనరవ ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలు, చెరువులు, సమీపంలో రిజర్వాయర్ ఉండడంతో చలి తీవ్రతతో పాటు నిత్యం పొగమంచు కమ్ముకుంటోంది. సోమవారం ఉదయం 8 గంటల వరకూ ఇక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో వాకర్స్‌తో పాటు స్థానికులు ఎంజాయ్ చేస్తున్నారు.


మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు చేరే మార్గంలో సోమవారం ఉదయం కమ్ముకున్న పొగ మంచు

మృతులకు ఎంప్లాయిస్ యూనియన్ సంతాపం


నివాళులు అర్పిస్తున్న సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు

ఎన్ఏడీ జంక్షన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర బండారలో డిఫెన్స్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బ్లాస్టింగ్ ప్రమాదంలో మృతిచెందిన ఎనిమిది మంది కార్మికుల కుటుంబసభ్యులకు ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు సంతాపం తెలిపారు. ఎన్ఏడీ గేటు వద్ద నిర్వహిస్తున్న సత్యాగ్రహ శిబిరంలో సోమవారం మృతులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రక్షణ రంగ సంస్థల్లో చేపడుతున్న ప్రైవేటీకరణ విధానాలతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. రక్షణ రంగంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. రక్షణరంగంలో విదేశీ పెట్టబడులను ఆహ్వానించడం భద్రతకు పెనుముప్పు అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.నూకరాజు, శ్రీనివాస్ వర్క్ కమిటీ సభ్యులు, సంఘ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

జడ్పీ స్థలాలను పరిశీలించిన చైర్‌పర్సన్


రైల్వేస్టేషన్ సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో నారాయణమూర్తి

గోపాలపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్ సమీపంలోని జడ్పీ స్థలాన్ని చైర్‌పర్సన్ సుభద్ర, సీఈవో నారాయణమూర్తి సోమవారం పరిశీలించారు. ఇక్కడ జిల్లా పరిషత్‌కు సుమారు 1.09 ఎకరాల స్థలం ఉంది. ఇందులో కొంతభాగం సింహాచలం అప్పన్న దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నాలుగు దశాబ్దాల క్రితం వసతిగృహాలు నిర్మించారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. దీంతో జడ్పీ స్థలం ఆక్రమణకు గురైంది. శిథిల వసతిగృహాలను, ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హైస్కూల్‌ను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్రీడామైదానాన్ని, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను చూశారు. ఇక్కడికి సమీపంలో ఆక్రమణకు గురైన జడ్పీ స్థలాన్ని పరిశీలించారు. స్థలాల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ తీర్థ మహోత్సవం

గోపాలపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటనరవలో కొలువైన శ్రీపైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజామున అమ్మవారికి విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తీర్థమహోత్సవం సందర్భంగా గ్రామంలో సాయంత్రం ఘనంగా పరస నిర్వహించారు.

గ్రామ దేవతల పరస

పెందుర్తిరూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం, దుర్గానగర్, గవరపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్య దేవతలు దుర్గమాంబ, బంగారుమాంబల పరస సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చి పూజలు చేసి, ముడుపులు చెల్లించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు, భజనలు అలరించాయి.



కోటనరవలో కొలువైన పైడితల్లమ్మ అమ్మవారు, బుచ్చిరాజుపాలెంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

11న బుచ్చిరాజుపాలెం పైడితల్లమ్మ పండగ

ఎన్ఏడీ జంక్షన్: బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల ఆరాధ్యదైవం పైడితల్లమ్మ అమ్మవారి పండగను ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు ఈఓ పి.సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో 11న ప్రధాన, 18న మారువారం పండగను చేసేందుకు తీర్మానించారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ పండగను వైభవంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్సవ కమిటీ కార్యక్రమాలు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పూరెడ్డి ప్రకాష్‌రెడ్డి, చుక్కా పైడిరాజు, ఎల మంచిలి ప్రసాద్, చంద్రారావు, పైడిరెడ్డి, నూకరెడ్డి, కిశోర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి అరుణ్‌కుమార్, అన్నపూర్ణ, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తులు పునరావృత్తం కావొద్దు: ఆర్డీవో

పెందుర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సంబంధిత సమస్యలపై అందిన దరఖాస్తులు పునరావృత్తం కావొద్దని ఆర్డీవో శ్రీలేఖ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆర్డీవో హాజరయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిశీలించారు. పెండింగ్ వినతుల పరిష్కార చర్యలపై ఆరా తీశారు. వినతులు పునరావృతం కారాదని, చేపట్టిన చర్యలపై ఆధారాలతో ఫిర్యాదుదారులకు తెలియజేయాలని వీఆర్వోలకు ఆదేశించారు. నరవ,లక్ష్మీపురంలో దరఖాస్తులు పునరావృతం కావడంపై వివరణ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి రాక

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ మంగళవారం సాయంత్రం స్టీల్‌ప్లాంటుకు రానున్నారు. బుధవారం ఆయన ఉక్కు కర్మాగారంలో పర్యటిస్తారన్నారు అలాగే ఉక్కు ఉన్నతాధికారులతో సమావేశమయ్యాక ప్లాంట్ అధికారుల సంఘం, కార్మిక సంఘాలు, వివిధ అసోసియేషన్లతో సమావేశం కానున్నారు.

678 మంది రక్తదానం

మల్కాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ వాకర్స్ మైదానం ప్రాంగణంలో పీవీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రికార్డు స్థాయిలో 678 మంది రక్తదానం చేశారు. ట్రస్టు చైర్మన్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ ఆధ్వర్యంలో రోటరీ, లయన్స్, ఎన్టీఆర్, విజయశ్రీ, అమ్మ అండ్ మదర్, వందేభారత్ అండ్ ఛత్రపతి శివాజీ, ఫస్ట్ అండ్ సంజీవని, లైఫ్ షేర్ తదితర బ్లడ్ బ్యాంక్‌ల నిర్వాహకులు యువకల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు పోషకాహారంతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ లక్ష్య సాధనకు కృషిచేయాలి'

మల్కాపురం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యంగ లక్ష్యాలైన సార్వభౌమాధికారం, సామ్యవాదం లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, ఆత్మగౌరవం, ఐక్యత సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో రాజ్యాంగ పరిరక్షణలో యువత పాత్ర సదస్సు ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎవరు ఏ వృత్తిలో ఉన్నా రాజ్యాంగ లక్ష్య సాధనకు కృషిచేయాలన్నారు. మహిళల జీవితంలో మార్పు కనిపించిందని, సామాన్యులు అత్యున్నత పదవులు అలంకరించారన్నారు. సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అధ్యక్షత వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 ఫిర్యాదులు

వేపగుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు ఆరు వినతులు అందాయి. కొత్తపాలెంలో అక్రమనిర్మాణంపై చర్యలు చేపట్టాలని, రవినగర్‌లో చెత్త ఇబ్బందులు తొలగించాలని, కుమ్మరికాలనీలో రోడ్డు ఆక్రమణ, పెందుర్తి ఉడాకాలనీలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. వినతులను జెడ్సీ కె.హైమావతి స్వీకరించారు.

భరత్‌నగర్‌లో సుందరకాండ పారాయణం

వేపగుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ గోపీ జనవల్లభస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సుందరకాండ పారాయణం నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్

» 1200 మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా


రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న క్రీడాకారులు

కంచరపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్, గేమ్స్ సహ సమన్వయ కర్తలు డా.కె.నారాయణరావు, బి.జానకిరామయ్య తెలియజేశారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, సాంకేతిక విద్యాశాఖ సంచాలకుడు గణేష్‌కుమార్ మీట్‌ను ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,200 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు భోజనం, వసతి ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ, తిరుపతి రీజనల్ జాయింట్ డైరెక్టర్లు జె.సత్యనారాయణమూర్తి, నిర్మలకుమారి ప్రియ పర్యవేక్షణలో క్రీడలు జరుగుతాయన్నారు. అన్ని జిల్లాల నుంచి 500 మంది బాలికలు, 700 మంది బాలురు పాల్గొంటారని వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

ఎండాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి ఎక్సైజ్ కోర్టు రెండో తరగతి జ్యుడీషియల్ జడ్జి జరిమానా విధించినట్టు పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు నుంచి రూ.12,500 చొప్పున మొత్తం రూ.1,19,500 జరిమానా విధించినట్టు ఆయన వివరించారు.

వాహన చోరీలకు చెక్

» అందుబాటులోకి సెక్యూరిటీ అలారమ్స్
» కొనుగోలుపై ఆసక్తి చూపుతున్న వాహన చోదకులు
» ధర రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు
» నగరంలోని మార్కెట్లలో లభ్యం


వివిధ రకాల సెక్యూరిటీ అలారమ్స్

(భీమునిపట్నం రూరల్, ఆంధ్రజ్యోతి)


వాహన చోరీలను అరికట్టేందుకు వీలుగా ఏర్పాటు చేసుకునేందుకు సెక్యూరిటీ అలారమ్స్ అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమంగా ద్విచక్ర వాహనాల్లో బ్యాటరీలు, కార్లలో స్టీరియోసెట్‌లు, ఎక్కువ కాలం నిలిపి ఉంచిన వాహనాల నుంచి టైర్లు మాయపోతున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఇలాంటి చోరీలను నియంత్రించేందుకు సెక్యూరిటీ అలారమ్స్ దోహదపడతాయని పోలీసులు భావిస్తున్నారు.

ఇటీవల జిల్లాలో వాహనాలు, వాటిలో పరికరాలను చోరీ చేసే వారి సంఖ్య పెరుగుతోంది. కొంతమంది ఆకతాయిలు బ్లేడుతో సీట్లను కోసివేయడం లాంటి సంఘటనలూ ఉన్నాయి. ఈ సమయంలో అలాంటి వారు దొరికితే తగిన బుద్ధి చెప్పవచ్చని అంతా భావిస్తారు. ఈ సమస్యలను నివారించడానికి సెక్యూరిటీ అలారమ్స్ దోహదపడనున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలకు అమర్చుకోవడానికి వీలుగా విశాఖ విపణిలో ఇవి విరివిగా లభ్యమవుతున్నాయి. ఖరీదు మరీ ఎక్కువ కాకపోవడంతో వీటిని కొనుగోలు చేసేందుకు వాహన చోదకులు ఆసక్తి చూపిస్తున్నారు. వాహనాలకు రక్షణ కల్పించడానికి అమర్చే ఎలక్ట్రానిక్ పరికరాలను సెక్యూరిటీ అలారమ్స్ అంటారు. వీటిని బయటకు కనిపించకుండా అమర్చడం ద్వారా పనిచేస్తాయి. అలారమ్ అమర్చిన వాహనాన్ని ఎవరైనా తాకితే పెద్ద శబ్దం వస్తుంది. మొదటిసారి పెద్దగా హారన్ మోగుతుంది. కాస్త విరామం తర్వాత మరోసారి మోగుతుంది. ఈ విధంగా ఐదుసార్లు హారన్ రావడంతో యజమాని జాగ్రత్తపడే వీలుంటుంది.


సెక్యూరిటీ అలారమ్‌కు చెందిన రిమోట్

ఎలా పనిచేస్తాయంటే...

వాహనాలకు అమర్చిన సెక్యూరిటీ అలారమ్స్‌కు రెండు స్పీకర్లు, రెండు రిమెట్ సిస్టంలు ఉంటాయి. ఇది సెన్సార్‌తో పనిచేస్తుంది. హారన్లలో ఒకటి వాహనానికి, రెండోది యజమానికి అందుబాటులో ఉంటుంది. దీనిని వాహనంలో ఉన్న బ్యాటరీకి అనుసంధానం చేసి, బయటకి కనిపించకుండా అమర్చుతారు. ద్విచక్రవాహనంలో సీటు కింద, కారుకి లోపల అమరుస్తారు. రిమోట్ విధానంలో లాక్, అన్‌లాక్ చేసే అవకాశం ఉంది. సెల్ఫ్‌స్టార్ట్ చేసే వాహనాలకు దీనిని అమర్చుకోవడం సులభం. ఈ విధంగా అమర్చిన వాహనాన్ని 20 మీటర్ల దూరం నుంచి కూడా స్టార్ట్ చేసే అవకాశం ఉంటుంది.


రిమోట్‌తో కారు అలారం ఆన్ చేస్తున్న దృశ్యం

ఎక్కడ లభిస్తున్నాయి

సెక్యూరిటీ అలారమ్స్ డాబాగార్డెన్స్ ప్రాంతంలోని నాలుగు దుకాణాలలో లభిస్తున్నాయి. కంపెనీలను బట్టి రూ.రెండు వేల నుంచి రూ.5 వేల వరకు ధర పలుకుతున్నాయి. వీటిని కొనుగోలు చేసిన తర్వాత అమర్చడానికి కూడా కొంత చార్జి వసూలు చేస్తారు. ఈ అలారమ్స్ చైనా, జపాన్‌లలో తయారైనవే ఎక్కువ. మనదేశంలో ఉత్పత్తి అయినవి కూడా ఉన్నా వాటి అమ్మకాలు ఆశాజనకంగా లేవని దుకాణ యజమానులు చెబుతున్నారు. అలారమ్స్‌లో మిండా, బ్లాక్ డాగ్, సేఫ్‌గార్డు, థండర్, పోలీసుమాన్, సెక్యూరిటీ డెన్ పేర్లలో విరివిగా లభిస్తున్నాయి. ప్రస్తుతం సెక్యూరిటీ అలారమ్స్ అమర్చుకునే వాహన దారుల సంఖ్య పెరుగుతోందని, ఫలితంగా అమ్మకాలు బాగున్నాయని దుకాణదారులు చెబుతున్నారు. ముఖ్యమంగా ఇళ్లలో వాహనాలు పెట్టుకోవడానికి స్థలం లేక ఆరుబయట పార్క్ చేసుకునేవారికి ఇవి ఎక్కువ ఉపయోగపడతాయంటున్నారు.

గ్రీన్ సిటీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేశ్ పూజలు

» పాల్గొన్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీ శ్రీవారి ఆలయంలో సోమవారం రాత్రి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావు, తదితరులు ఘన స్వాగతం పలికారు. శ్రీవారిని దర్శించాక తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. లోకేశ్‌తో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు. ఉక్కు కార్మికు లు, పలు సంఘాల నాయకులు వినతిపత్రాలను అందజేశారు. అనంత రం లోకేశ్ ఆలయ ప్రాంగణం వద్దకు వచ్చిన వారితో ఫొటోలు తీసుకున్నారు. అనంతరం అభిమానులు భవిష్యత్తు సీఎం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, మొల్లి ముత్యాల నాయుడు, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాస్, దల్లి గోవింద్, రాజాన రామారావు, కూటమి నాయకులు కేబులు మూర్తి, ప్రసాదుల శ్రీనివాసరావు, నల్లూరు సూర్యనారాయణ, కోన తాతారావు, కరణంరెడ్డి నరసింగ రావు, దీనంకొండ కృష్ణంరాజు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్లు బండి మోహిత్, బన్సీధర్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఉదయం కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్‌కు పలువురు తమ సమస్యలు వివరించారు. పార్టీ కార్యాలయంలో మరింతమంది వినతిపత్రాలు ఇచ్చారు.


శ్రీవారికి పూజలు చేస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు


మంత్రికి స్వామివారి చిత్ర పటం బహూకరిస్తున్న దృశ్యం


జిల్లా కోర్టు వద్ద అభిమానులకు అభివాదం చేస్తున్న మంత్రి లోకేశ్


పార్టీ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్


గ్రీన్‌సిటీ ఆలయంలోకి స్వాగతం పలుకుతున్న నాయకులు, అభిమానులు

గాదెకు ఆపస్ మద్దతు



మద్దతు ప్రకటిస్తున్న ఆపస్ సభ్యులు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న గాదె శ్రీనివాసులునాయుడుకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. దశపల్లా హిల్స్‌లోని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల ఆపస్ ముఖ్యప్రతినిధుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ గాదె ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీ సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ శ్రావణ్‌కుమార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్జీలపై సమగ్ర విచారణ చేపట్టండి

» అధికారులకు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచన
» ప్రజా ఫిర్యాదుల పరిష్కార విభాగానికి 264 వినతులు

మహారాణిపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సమర్పించే అర్జీలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి శాశ్వత, సంతృప్తికర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 264 వినతులు స్వీకరించారు. వాటిలో రెవెన్యూ విభాగానివి 130, జీవీఎంసీ 59, పోలీసు 15, ఇతర విభాగాలకు సంబంధించి 60 వినతులున్నాయి. అర్జీ అందిన 24 గంటల్లో పూర్తి విచారణ జరిపి పొరపాట్లకు తావు లేకుండా పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎంవో కార్యాలయం నుంచి వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీదారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, హౌసింగ్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనరేట్‌లో 79 అర్జీలు

పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీసీపీలు అజితా వెంజెండ్లా, మేరీ ప్రశాంతిలు బాధితుల నుంచి 79 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులనుంచి వివరాలు తెలుసుకొని చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుని పరిష్కరించాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను ఆదేశించారు.

జీవీఎంసీకి 58 వినతులు

వెంకోజీపాలెం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తితో కలసి ఆమె వినతులు స్వీకరించారు. ఫిర్యాదులు మూడు రోజుల్లో పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న జేసీ అశోక్, ఇతర అధికారులు

యువగళం రెండు వసంతాల వేడుకలు


భారీ కేకును కట్‌చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, తదితరులు

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. భారీ కేకును కట్‌చేశారు. విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, పార్టీ నాయకులు పైల ప్రసాద్, ప్రగడ నాగేశ్వరరావు, సీతంరాజు సుధాకర్, పీలా శ్రీనివాసరావు, బత్తుల తాతయ్యబాబు, గంటా రవితేజ, చింతకాయల విజయ్, కోరాడ రాజబాబు, వెల్లంకి భరత్, చోడే పట్టాభి, లొడగల కృష్ణ, గొంప కృష్ణ, ఆళ్ల శ్రీనివాసరావు, అనంతలక్ష్మి, తోట రత్నం, తమ్మిన విజయకుమార్, అక్కిరెడ్డి జగదీష్, కొయిలాడ వెంకట్, సనపల వరప్రసాద్, కోట నరేష్ తదితరులు హాజరయ్యారు.

క్రైం... crime news

కృష్ణాపురంలో వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

» అనుమానాస్పద మృతులుగా కేసు నమోదు చేసిన పోలీసులు


మృతులు లక్ష్మి, ఆదిత్య (ఫైల్)

పద్మనాభం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వేర్వేరు చోట్ల వివాహిత, యువకుడు సోమవారం ఉరి వేసుకొని మృతి చెందారు. సీఐ సీహెచ్ శ్రీధర్ తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన కనక లక్ష్మి (31) తన ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. ఉదయం 11-12 గంటల మధ్య ఈ సంఘటన జరిగినట్టు కుటుంబ సభ్యులు గుర్తించారు. అప్పటికే పెందుర్తి వెళ్లిన భర్త శంకరరావుకు సమాచారం రావడంతో వెళ్లి చూడగా భార్య మృతి చెందడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా అదే గ్రామానికి చెందిన మొకర ఆదిత్య (21) గ్రామానికి దూరంగా ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో ఉన్న పాడుబడిన భవనంలో ఉరి వేసుకొని మృతిచెందాడు. కుటుంబసభ్యులకు ఉదయం 12-12.45గంటల మధ్య తెలియడంతో మృతుడి తండ్రి రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనుమాన్పాద మృతులుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు. గ్రామంలో ఒకే రోజు ఇద్దరు మృతి చెందడంతో స్థానికులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

గుండెపోటుతో దువ్వాడ హెడ్ కానిస్టేబుల్ మృతి


ఎం.రవి (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ స్టేషన్‌లో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మన్నెం రవి (56) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ముస్తఫా జంక్షన్‌లో ఉంటున్న ఆయన ఇంటి నుంచి విధుల నిమిత్తం స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గ మధ్యంలో గుండె పోటు రావడంతో రోడ్డు పక్క వాహనాన్ని ఆపారు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవి మృతి చెందారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన రవి 1991 బ్యాచ్‌కు చెందినవారు. ఇటీవల బదిలీపై దువ్వాడ వచ్చారు. హెచ్‌సీ మృతదేహాన్ని ఏసీపీ టి.త్రినాథ్, సీఐ మల్లేశ్వరరావు, ఎస్‌ఐ వెంకటరావు,ఏఎస్‌ఐలు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. రవికి భార్య, ఇద్దరు కుమార్తెలు. మృతదేహాన్ని పాయకరావుపేట తరలించారు.

చోరీ కేసులను ఛేదించిన పోలీసులు

» 182 గ్రాముల బంగారం, రూ. 2.7 లక్షలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ, ఎస్‌ఐలు

పెందుర్తి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రెండు చోరీ కేసుల్లో ముగ్గురు నిందితులను పట్టుకున్న పోలీసులు వారి నుంచి 182 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.7 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం క్రైం ఏసీపీ డి.లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ డి.సూరిబాబు వివరాలు వెల్లడించారు. గుంటూరు నుంచి నగరానికి కారులో వస్తూ అర్ధరాత్రి దాటిన తరువాత తాళం వేసివున్న ఇళ్లను గమనించి ఇనపరాడ్లతో తాళాలు పగలుకొట్టి చోరీ చేయడం, చోరీ సొత్తుతో అదే కారులో పరారవుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. గత ఏడాది జులైలో పెందుర్తి పాపయ్యరాజుపాలెం, భవానీనగర్‌లో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీ చేసి వెండి ఆభరణాలు అపహరించారు. పెందుర్తి పోలీసులు విచారణ చేపట్టి, ఇతర జిల్లాల ముఠా పనిగా భావించి గుంటూరు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన నల్లమోతుల సురేశ్, పుల్లెట్టికూర్తి ఉమామహేశ్వరరావు, మోదగమూడి రమేశ్‌లు చోరీ చేసినట్టు నిర్ధారించారు. ఉమామహేశ్వరరావు, రమేశ్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సురేశ్ పరారీ ఉన్నాడని తెలిపారు. జనవరి 3న న్యూకాలనీ నుంచి పురుషోత్తపురం ద్విచక్రవాహనంపై వస్తుండగా కృష్ణరాయపురం వద్ద బైక్ ఆపి సెల్‌ఫోన్లో మాట్లాడుతుండగా బ్యాగ్ అపహరణకు గురైంది. ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూరిబాబు సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించి, గోపాలపట్నం కొత్తపాలేనికి చెందిన కామాక కనకరాజును పట్టుకుని విచారించారు. అతడిని అరెస్టు చేసి రూ.2.7 లక్షల నగదు బ్యాగు స్వాధీనం చేసుకున్నారు. కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన ఎస్‌ఐ సూరిబాబు, ఏఎస్‌ఐ కేవీఎస్ఎన్ మూర్తి, హెచ్‌సీ జి.నాగరాజు, సిబ్బంది భవాని, శివప్రసాద్, దేవుడునాయుడు, తాతారావు, వెంకటేశ్‌లను ఏసీపీ, సీఐ అభినందించారు

చోరీ సొత్తు స్వాధీనం

ఎంవీపీ కాలనీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంవీపీ కాలనీలో జరిగిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ద్వారకా జోన్ సీఐ వి.చక్రధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీ మూడో సెక్టరులో ఉంటున్న శామ్యూల్ అనీల్‌కుమార్ ఇంట్లో ఈ నెల 16న చోరీ జరిగింది. పోలీసుల విచారణలో జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి నరసింగరావు దొంగతనం చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రూ.61,700 విలువైన టీవీ, స్టవ్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ అప్పలరాజు, ఏఎస్‌ఐ కిశోర్‌బాబు, కానిస్టేబుళ్లు అప్పలరాజు, అగస్టీన్‌లను అభినందించారు.

'అనధికార లే అవుట్‌లలో స్థలాలు కొనొద్దు'

విశాఖపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్‌లలో నివాస స్థలాలు కొని ఇబ్బందులు పడవద్దని, వీఎంఆర్డీఏ అప్రూవ్ చేసిన స్థలాలు కొనుగోలు చేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్, లేఅవుట్‌లలో మధ్యతరగతి ప్రజలకు 150, 200, 240 చదరపు గజాల విస్తీర్ణంలో స్థలాలు లభిస్తున్నాయన్నారు. జిల్లాలోని రామవరం, పాలవలస, గంగసాని అగ్రహారం, అనకాపల్లి జిల్లా అడ్డూరు, విజయనగరం జిల్లా గరివిడిలో స్థలాలున్నాయన్నారు.